# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 21-6-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 సంపుటి :29 సంచిక: 243 పేజీలు:6 వెల: రూ.1/-


## తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సిరిసిల్ల జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటన



రాజన్న సిరిసిల్ల, జూన్ 20:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ఇవాళ సిరిసిల్ల జిల్లాలో పర్యటిస్తున్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా విద్యాదినోత్సవం జరుపుకుంటు న్నారు. అందులో భాగంగా మంత్రి ముందుగా గంబీరావుపేట మండలం గోరంట్యాలలోని పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు.

ఆ తర్వాత ఎల్లారెడ్డిపేటకు చేరుకున్నారు. ఎల్లారెడ్డిపేటలో పాఠశాల భవన సముదాయాన్ని ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వెంట తెలంగాణ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి వినోద్‌కుమార్‌తోపాటు పలువురు నేతలు ఉన్నారు. మరికాసేపట్లో సమావేశంలో మంత్రి ప్రసంగించనున్నారు.

## రాగల మూడు రోజుల్లో తెలంగాణలో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు

హైదరాబాద్ జూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);రాగల మూడు రోజుల్లో తెలంగాణలో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వివరించింది. మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో వడగాలు వీస్తాయని తెలిపింది. అదే సమయంలో భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే బుధవారం నుంచి శుక్రవారం ఉదయం వరకు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఇదిలా ఉండగా నైరుతి రుతుపవనాలు ఏపీలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నాయి. రాబోయే రెండు, మూడు రోజుల్లో దక్షిణభారతదేశమంతా విస్తరించే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ వివరించింది.






నేటి కందం– నేటికి అందం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

కం॥ ఇంగవము ను బెంచు రీతిన
అంగారమె చల్లబడెడి ఆత్మీయతతో
బంగారము పండెడి గతి
సంగీత దినోత్సవము ను జరుపగ వలయున్!!



–రాధశ్రీ
సెల్:9494481210

( జూన్ 21న ప్రపంచ సంగీత దినం..)

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

## రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ప్రారంభించనున్న సీఎం కేసీఆర్.. ఎల్లుండి శంకర్‌పల్లిలో పర్యటన

రంగారెడ్డి, జూన్ 20:రంగారెడ్డి జిల్లాలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ప్రారంభం కానుంది. శంకర్‌పల్లి మండలం కొండకల్ గ్రామంలో నిర్మించిన ప్రైవేట్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీని సీఎం కేసీఆర్ ఎల్లుండి (22న గురువారం) ప్రారంభించనున్నారు. ఈ క్రమంలో ఆయన శంకర్‌పల్లి మండలంలో పర్యటించనున్నట్టు తెలుస్తోంది. అంతేకాకుండా.. సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రపురం మండల పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ప్రారంభించి, లబ్ధిదారులకు ఇంటి తాళాలు ఇవ్వనున్నట్టు సమాచారం.

ఆ తర్వాత పటాన్ చెరులోని ప్రభుత్వ సూపర్? స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేయనున్నట్టు తెలుస్తోంది. ఇక.. ఆయా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కార్యక్రమాలకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు సీఎం పర్యటించే అన్ని ప్రదేశాలను పరిశీలించారు. ఆయా ప్రదేశాల్లో ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. తగు ఏర్పట్లపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

## సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఉట్టిపడుతున్న ఆధ్యాత్మిక వైభవం : మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 20: ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో ఆధ్యాత్మిక వైభవం ఉట్టిపడుతుందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక చింతన కలిగిన సీఎం కేసీఆర్ ఈ ప్రాంత సాంప్రదాయాలకు, ఆలయాలకు, పండుగలకు, వేడుకలకు అత్యంత ప్రాధన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత మన పండుగలకు, వేడుకలకు ప్రపంచ ఖ్యాతి లభించిందన్నారు. స్వపరిపాలనలో తెలంగాణ స్వంత అస్థిత్వంతో కూడిన ఆధ్యాత్మిక శోభను సంతరించుకుందని మంత్రి తెలిపారు.

తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో సుభిక్షంగా, సస్యశ్యామలంగా, సుఖసంతోషాలతో వర్ధిల్లుతుంది అని ఇంద్రకరణ్ రెడ్డి పేర్కొన్నారు. అందుకు సీఎం కేసీఆర్ 9 ఏండ్ల పాలన సాక్షిగా నిలిచిందని కొనియాడారు. రాష్ట్రాన్ని అన్ని రంగాలతో పాటుగా ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేసుకోవాలనే ఆలోచనతో ఆలయాల అభివృద్ధికి కేసీఆర్ పూనుకున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రణాళికాబద్ధంగా ఆలయాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. శ్రీ లక్ష్మి నర్సింహుడు కొలువైన యాదాద్రి దేశంలోని గొప్ప పుణ్యక్షేత్రాలలో ఒక్కటిగా రూపుదిద్దుకోవడం మనందరికీ గర్వకారణం అని ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు.

బుధవారం ఆధ్మాత్మిక దినోత్సవం సందర్భంగా దేవాదాయ శాఖ ప్రగతి నివేదిక వివరాలను మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి వెల్లడించారు.

దేశంలోనే అత్యంత పురాతన పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా పేరొందిన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని దాదాపు రూ.1,200 కోట్ల వ్యయంతో పునర్నిర్మించడం జరిగిందని తెలిపారు. దక్షిణ కాశీగా వెలుగొందుతున్న వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ అభివృద్ధి పనుల కోసం వీటీడీఏ 35 ఎకరాల భూమిని సేకరించింది. ఇప్పటి వరకు వేములవాడ ఆలయ అభివృద్ధి విస్తరణకు రూ. 70 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. కొండగట్టు అంజనేయ స్వామివారి ఆలయ అభివృద్ధిపై సీయం కేసీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆలయ అభివృద్ధికి రూ. 500 కోట్లు ప్రకటించారని గుర్తు చేశారు.

రూ. 50 కోట్లతో బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దేవాలయం, రూ. 100 కోట్లతో ధర్మపురి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయం, రూ.25 కోట్లతో కాళేశ్వర శ్రీ ముక్తేశ్వర స్వామి దేవాలయాలను ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా అభివృద్ధి చేసుకుంటున్నాం. వీటితో పాటు మరో 8 ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

## అభివృద్ధి జరిగిందని రుజువు చేస్తే ముక్కు నేలకు రాస్తారా.. : మంత్రి జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 20: ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో తొమ్మిది సంవత్సరాలుగా జరిగిన అభివృద్ధికి దశాబ్ది ఉత్సవాలే నిలువెత్తు తార్కాణమని విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. అధికారిక లెక్కలు జరిగిన అభివృద్ధికి నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నల్గొండ జిల్లా కేంద్రంలో జరిగిన విద్యా దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు.



ఈ సందర్భంగా ఆయన గడిచిన తొమ్మిదేళ్ల వ్యవధిలో ఉమ్మడి నల్లగొండ జిల్లా విద్యారంగంలో సాధించిన విజయాలను ఆయన గణాంకాలతో సహా సోదాహరణంగా వివరించారు. జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత వ్యాఖ్యలపై మంత్రి ఘాటుగానే స్పందించారు. తొమ్మిదేళ్ల వ్యవధిలో ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సాధించిన అభివృద్ధిని నిరూపిస్తే కాంగ్రెస్ నేతలు ముక్కులు నేలకు రాస్తారా? అంటూ మంత్రి జగదీశ్‌రెడ్డి సవాల్ విసిరారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ముక్కులు నేలకు రాయాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి జరగలేదని నిరూపిస్తే క్షమాపణ చెప్పేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

## దశాబ్ది ఉత్సవాల ముగింపు రోజున ట్యాంక్‌బండ్‌పై 750 డ్రోన్‌లతో భారీ డ్రోన్ షో :మంత్రి తలసాని



హైదరాబాద్, జూన్ 20:తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపును ఘనంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. ముగింపురోజున ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ట్యాంక్‌బండ్‌పై 750 డ్రోన్‌లతో భారీ డ్రోన్ షో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మంగళవారం అంబేద్కర్ విగ్రహం వద్ద హోంమంత్రి మహమూద్ అలీ, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత రెడ్డి, డీజీపీ అంజనీ కుమార్, ఆర్ అండ్ బీ కార్యదర్శి శ్రీనివాసరాజు లతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన మాటాడుతూ 22 వ తేదీన నగరంలోని అన్ని నియోజకవర్గాల నుంచి అంబేద్కర్ విగ్రహం వద్దకు బైక్ ర్యాలీ చేరుకుంటుందని వెల్లడించారు.

అనంతరం వేలాదిమంది కళాకారులు నృత్యాలు, డప్పు చప్పుళు, వివిధ వేషధారణలతో అమరవీరుల స్మారక కేంద్రం వరకు ర్యాలీ చేరుకుంటుందన్నారు. అనంతరం స్మారక కేంద్రాన్ని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రారంభించి సభలో ప్రసంగిస్తారని తెలిపారు.

ఈ సందర్భంగా గడిచిన 9 సంవత్సరాలలో ప్రభుత్వం సాధించిన విజయాలు, అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించే విధంగా డ్రోన్ షో ఉంటుందని చెప్పారు. ఆరోజు సాయంత్రం ట్యాంక్ బండ్ పై రాకపోకలు నిలిపివేస్తున్నామని వివరించారు. మంత్రి వెంట కలెక్టర్ అమయ్ కుమార్, సమాచార శాఖ కమిషనర్ అశోక్ రెడ్డి, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ హరికృష్ణ, పలువురు డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

## ప్రతి తరగతి గది.. తరగని విజ్ఞాన గని : మంత్రి కేటీఆర్

హైదరాబాద్, జూన్ 20: రాష్ట్రంలోని ప్రతి విద్యార్థిని నాణ్యమైన విద్యను అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలలు, కాలేజీలు నెలకొల్పి నాణ్యమైన విద్యను అందిస్తుంది ప్రభుత్వం. మన ఊరు ? మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు మౌలిక వసతులను కల్పిస్తుంది. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇవాళ విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. విద్యతోనే వికాసం.. విద్యతోనే ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. ప్రతి తరగతి గది.. తరగని విజ్ఞాన గని.. ఆ నాలుగుగోడలే.. దేశ భవిష్యత్తుకు మూలస్తంభాలు అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ సిద్ధాంతాన్ని నమ్మడమే కాదు.. అక్షరాలా ఆచరించింది తెలంగాణ ప్రభుత్వం.. తొమ్మిదేళ్ల ప్రగతి ప్రస్థానంలో సరికొత్త విద్యా విప్లవం.. యావత్ దేశానికే పాఠాలు నేర్పుతోంది తెలంగాణ ప్రభుత్వం అని కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. మన ఊరు–మన బడితో సమూల మార్పులు చేశామన్నారు. 26 వేల పాఠశాలలకు సరికొత్త రూపురేఖలు వచ్చాయన్నారు. మన భావితరాలకు బంగారు బాటలేసే.. ఈ మహాయజ్ఞంలో మేముసైతం అంటూ మనసుపెట్టి పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులకుతెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు కేటీఆర్.

## పెరిగిన ఎండలు మండుతున్న కూరగాయల రేట్లు

హైదరాబాద్ జూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఎండలతో పాటు నగరంలో కూరగాయల ధరలూ భగ్గుమంటున్నాయి. రైతు బజార్లతో పాటు హోల్‌సేల్ మార్కెట్లలో రేట్లు అమాంతంగా పెరగడంతో సామాన్యులు విలవిలలాడుతున్నారు. గుడిమల్కాపూర్, బోయిన్‌పల్లి, సికింద్రాబాద్, ఎల్‌బీనగర్, మోండా మార్కెట్లతో పాటు సరూర్‌నగర్, మెహిదీపట్నం, ఎర్రగడ్డ, కూకట్‌పల్లి లాంటి రైతు బజార్లకు పెద్ద ఎత్తున కూరగాయలు వస్తుంటాయి. శివారులోని మొయినాబాద్, ఇబ్రహీంపట్నంతోపాటు ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి క్వింటాళ్ల కొద్దీ కూరగాయలు వస్తుంటాయి. సరూర్‌నగర్ రైతుబజార్‌కు సాధారణంగా నిత్యం 40 క్వింటాళ్ల టమాట, 30 నుంచి 35 క్వింటాళ్ల వరకు పచ్చిమిర్చి, వంకాయ 30 క్వింటాళ్లు, బెండకాయ 32 క్వింటాళు, క్యారట్ 35 క్వింటాళ్ల వరకు వస్తుంటాయి. పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా దిగుబడి లేకపోవడంతో ఇక్కడికి దిగుమతి కూడా భారీగా తగ్గింది. ప్రస్తుతం ఇదే రైతుబజార్‌లో సాధారణ రోజులతో పోల్చితే 40 శాతం దిగుమతి తగ్గిపోవడంతో ధరలు పెరిగాయి. రూ. వందకు కిలో టవటా, కిలో పచ్చిమిర్చి కూడా రావడం లేదని సామాన్యులు వాపోతున్నారు.

ఎండల తీవ్రతకు కోళ్లు చనిపోతున్నాయంటూ రెండు వారాలుగా వ్యాపారులు చికెన్ ధరను పెంచేశారు. ఆదివారం కూడా పలు ప్రాంతాల్లో స్కిన్‌లె?స కిలో రూ.280 నుంచి రూ.300 వరకు, లైవ్ కోడి రూ.190 నుంచి రూ.210 వరకు అమ్మారు. దీంతో చాలామంది చేపలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. లైవ్‌ఫిష్ కిలో రూ.180, ఇతర చేపలు రూ.150, కొర్రమీను రూ.350 నుంచి రూ.400 వరకు విక్రయించడంతో వాటిని తీసుకునేందుకు మార్కెట్లకు భారీగా తరలివెళ్లారు.

మండుతున్న ఎండలతోపాటు కొత్త పంట రాకపోవడంతో ధరలు పెరుగుతున్నాయని సరూర్‌నగర్ రైతుబజార్ అధికారి స్రవంతి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఆగస్ట్ మొదటి వారం వరకు ధరలు ఇలాగే ఉంటాయని, వర్షాలు ప్రారంభమైన తర్వాత అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

## "ప్రజా పార్టీ" పేరుతో గద్దర్ కొత్త పార్టీ ..గద్దర్ కీలక నిర్ణయం..

న్యూ ఢిల్లీ జూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: "గద్దర్ ప్రజా పార్టీ" పేరుతో గద్దర్ కొత్త పార్టీ పెడుతున్నారు. పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ఆయన ఢిల్లీ వెళ్తున్నారు. ఈసీ అధికారులను కలిసి కొత్త పార్టీ రిజిస్ట్రేషన్ ప్రారంభించనున్నారు. గద్దర్ విప్లవానికి పోరాటానికి ప్రతీక. అందువల్లే "గద్దర్ ప్రజా పార్టీ" జెండాను మూడు రంగులతో రూపొందించినట్లు తెలుస్తోంది. అలాగే జెండా మధ్యలో పిడికిలిని పెట్టారని సమాచారం. ఈ మూడు రంగుల్లో ఎరుపు, నీలి, ఆకుపచ్చ రంగులతో రూపొందించారనే ప్రచారం జరుగుతోంది. ఎందుకంటే గద్దర్ తన ప్రయాణాన్ని ఎరుపురంగుతో ప్రారంభించారు. గద్దర్ మొదటగా అంబేద్కరిస్టు.. కాలానుగుణంగా ఆయన వామపక్ష రాజకీయాలపై ఆకర్షితులయ్యారు. అందుకే నీలి రంగు కూడా జెండాలో తప్పకుండా ఉంటుందని భావిస్తున్నారు. గత కొద్ది రోజులుగా రాష్ట్ర రాజకీయాల్లో గద్దర్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నారు. ఆ మధ్య వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరిగింది కూడా. స్వరాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితి, నిరుద్యోగ సమస్య, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల తీరు, ధరణి పోర్టల్ వల్ల ప్రజలు పడుతున్న బాధలను.. 'నన్ను గన్న తల్లుల్లారా' అనే బాణిలో వివరిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను బట్టబయలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే గద్దర్.. సీఎం కేసీఆర్‌పై పోటీ చేస్తారనే ప్రచారం కూడా జరిగింది. ఆయన కాంగ్రెస్ చేరి ఆ పార్టీ నుంచే పోటీ చేస్తారని అందరూ అనుకున్నారు. పోరు బాటకు పొద్దు పొడుపు. నిద్రాణమైన తెలంగాణకు మేలుకొలుపు. బానిసలారా లెండిరా అంటూ బహుజనులను జాగృతం చేసినా.. అమ్మా తెలంగాణమా అని ప్రజల గోసను గానం చేసినా.. పొడుస్తున్న పొద్దుతో పోటీ పడి ఉద్యమాన్ని రగిలించినా.. అది గద్దర్‌కే సొంతం. గద్దర్ పాట విని ఎగిరి దుంకని పల్లె లేదంటే అతిశయోక్తి కాదు. పాటతోనే ప్రస్థానాన్ని ప్రారంభించి.. పాటతోనే ప్రజా ప్రస్థానాన్ని ముగిస్తానని చెప్పిన గద్దర్ అని పిలువబడే విఠల్ రావు ఇప్పుడు కొత్త పార్టీకి అంకురార్పణ చేస్తున్నారు. ఇప్పటికే పార్టీకి సంబంధించిన విధివిధాలను ఆయన రూపొందుకున్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే పార్టీ పేరు, జెండాను ఆయన రూపొందించారు కూడా.

## దేశానికి దిక్సూచిగా తెలంగాణ విద్యారంగం : మంత్రి మల్లారెడ్డి



మేడ్చల్, జూన్ 20: తెలంగాణ విద్యారంగం దేశానికి దిక్సూచిగా నిలిచిందని రాష్ట్రకార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన విద్యాదినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ విద్యారంగంలో విప్లవాత్మకమైన ప్రగతిని సాధించిందని పేర్కొన్నారు.

పదేళ్లకాలంలో దేశంలోని అన్ని పోటీ పరీక్షలలో తెలంగాణ విద్యార్థులే అధికంగా ర్యాంకులు సాధించి తెలంగాణ సత్తాను చాటుతున్నారని ప్రశంసించారు. ముఖ్యమంత్రి కృషి వల్ల ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య అన్యూహంగా పెరుగుతుందన్నారు. మన ఊరు–మనబడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు పెరిగాయని వెల్లడించారు.

ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి, డిజిటల్ తరగతులు, కంప్యూటర్ ల్యాబ్‌లు తదితర అధునిక సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి రూ. 7300 కోట్లు కేటాయించడం విద్యార్థుల అదృష్టం అని చెప్పారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, జిల్లా విద్యాధికారిణి విజయకుమారి, జడ్పీ వైస్ చైర్మన్ వెంకటేశ్, మున్సిపల్ చైర్మన్లు ప్రణిత, కొండల్‌రెడ్డి, జడ్పీటీసీ అనిత, శైలజా, ఎల్లుబాయి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాహిత్య సభలకు నిజామాబాద్ సాహితీ ప్రముఖులు

హైదరాబాద్, జూన్ 20: తెలంగాణ సాహిత్య సభల్లో భాగంగా ఈ నెల 21, 22వ తేదీల్లో హైదరాబాద్ తెలంగాణ సారస్వత పరిషత్‌లో భారత జాగృతి తెలంగాణ సాహిత్య అవలోకనం సదస్సు నిర్వహించనుంది. ఈ సదస్సుకు నిజామాబాద్ జిల్లాకు చెందిన సాహితీ ప్రముఖులు హాజరు కానున్నట్లు భారత జాగృతి జిల్లా అధ్యక్షులు అవంతి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత అధ్యక్షతన జరిగే ఈ సభలలో ప్రముఖ కవి నాళేశ్వరం శంకరం గౌరవ అతిథిగా హాజరు కానున్నారు. జిల్లాకు చెందిన భారత జాగృతి ప్రధాన కార్యదర్శి రంగు నవీనాచారి సాహిత్య సభల నిర్వహణలో కీలకపాత్ర పోషిస్తున్నారు. జిల్లాకు చెందిన హరిదా రచయితల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్.. తెలంగాణ రేడియో రూపకాలు అనే అంశంపై పత్ర సమర్పణ చేయనున్నారు. తెలంగాణ విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్య త్రివేణి.. తెలంగాణ కథా విమర్శ అనే అంశంపై, ఆచార్య కే లావణ్య తెలంగాణ భాషపై ఉర్దూ పారాశీ భాషల ప్రభావం అనే అంశంపై, డాక్టర్ లక్ష్మణ చక్రవర్తి తెలంగాణ అధి విమర్శ అనే అంశంపై పత్ర సమర్పణ చేయనున్నారు.

డాక్టర్ కాసర్ల నరేశ్ రావు తెలంగాణ గేయ సాహిత్యంపై పత్ర సమర్పణ చేస్తారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన రచయితల వ్యాసాలన్నీ తెలంగాణ సాహిత్య అవలోకనం అనే గ్రంథంలో ముద్రితం కానున్నాయి. అలాగే జిల్లాకు చెందిన ప్రముఖ కవులు తిరుమల శ్రీనివాస్ ఆర్య, నరాల సుధాకర్, కంకణాల రాజేశ్వర్, ఆచార్య శ్రీధర, పురాని అజయ్ కుమార్, మేక రామస్వామి, తొగర్ల సురేశ్, మద్దుకూరి సాయిబాబు ఈ సభలకు హాజరు కానున్నారని ఆయన వివరించారు. జిల్లాకు చెందిన సాహిత్య అభిమానులు అందరూ సాహిత్య సభలకు హాజరు కావలసిందిగా ఆయన ఆహ్వానించారు.

# సంగీతానికి భాష, కులమతాల కంచెలు ఉంటాయా?!

## (21 జూన్ "ప్రపంచ సంగీత దినోత్సవం" సందర్భంగా)

ఒక చక్కని పాటకు స్పందించని మనిషుండడు, పులకించని తనువుండదు. వ్యక్తి మానసిక వికాసానికి, ప్రశాంత జీవన గమనానికి, కొన్ని రుగ్మతల చికిత్సకు సంగీతం ఓ దివ్య ఔషధంగా ఉపకరిస్తున్న విషయం మనకు తెలుసు. మనకు ఇష్టమైన సంగీత రసాన్ని ఆస్వాదించడంతో రక్తపోటు నియంత్రించబడడం, ఆందోళన తగ్గడం, మానసిక స్థితి మెరుగుపడడం, ప్రశాంతత కలగడం, ఒంటరితనానికి ఔషధంగా ఉపయోగపడడం, మానసిక ఆనందానికి కారణం కావడం జరుగుతుందని పలు అధ్యయనాలు రుజువు చేస్తున్నాయి. మెదడును ఉత్తేజపరచడంతో బాధలకు లేపనం అద్దినట్లు మానసిక ఉల్లాసం కలిగించే మహత్తర శక్తి సంగీతానికి ఉంటుందని మన అనుభవం తెలియజేస్తున్నది. సుసంగీతంతో ఆత్మవిశ్వాసం ఉరకలెత్తడం, పట్టుదల గట్టిపడడం, బాధలను మరిచిపోవడం, సృజన జాగృతం కావడం, వినోదాల విందులు వడ్డించడం కూడా జరుగుట గమనించారు. భావోద్వేగ ప్రకటన, కళా సౌందర్యాత్మక భావనలు జనించడం, సామాజిక అంశాలను ఏకరువు పెట్టడం, సమాజాన్ని జాగృత పరచడం, మన సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగించడం, వేడుక వాతావరణం కలగడం, కళాపోషకులకు ఆధరణ లభించడం, సమాజ ఏకీకరణ సుసాధ్యం కావడానికి సహితం సంగీతం దోహదపడుతున్నది.

### ప్రపంచ సంగీత దినోత్సవం(వరల్డ్ మ్యూజిక్ డే):

1982లో పారిస్‌లో "జాక్ లాంగ్" ప్రేరణతో ప్రారంభంమైన ప్రపంచ సంగీత దినోత్సవం ప్రతి ఏట 21 జూన్‌న ప్రపంచ దేశాలు ఘనంగా పాటించుట ఆనవాయితీగా మారింది. జీవితసారంగా మనల్ని అనునిత్యం జాగృతపరడమనే మహత్తరశక్తి సంగీతానికే ఉంది. ప్రపంచ సంగీత దినోత్సవ వేదికగా ఉచిత సంగీత ప్రదర్శనలు, కళాకారులను సన్మానించుకోవడం, అమర సంగీత విధ్వంసులను గుర్తు చేసుకోవడం లాంటివి నిర్వహించుట జరుగుతున్నది.

### భారతీయ వైవిధ్యభరిత సంగీత సంపద:

భారతంతో శాస్త్రీయ, జానపద, లలిత, సినీ, ఇండియన్ పాప్ సంగీతం లాంటి పలు రకాలైన సంగీత సాధనలకు మన దేశం పుట్టిళ్లుగా నిలుస్తున్నది. శాస్త్రీయ సంగీతంలో హిందుస్థానీ, కర్నాటక్ లాంటివి అతి ముఖ్యమైనవిగా పేరుగాంచాయి. వైవిధ్యభరితమైన భారత సమాజంలో అనేక రకాలైన జానపద సంగీతాలు ప్రాంతాలు/జాతుల వారీగా నిత్యం ప్రజలను ఉత్తేజపరుస్తున్నాయి. తెలుగు గ్రామీణులు పనితో పాటు పాడుకునే ప్రజాగీతాలు, కర్నాటక భవగీతి, పంజాబీ భంగ్రా, గుజరాతీ గర్బా/దాండియా, మహారాష్ట్ర లావ్నీ, రాజస్థానీ లంగస్/సరేరా/భోపా/జోగి/మంగనియార్, ఖవ్వాలీ లాంటివి ప్రముఖ జానపద సంగీతాలుగా పేరొందాయి.

### భారతీయ సంగీత మహాపోషకులు:

హిందూస్తానీ సంగీత వ్యవస్థాపకులు 'తాన్‌సేన్'ను 'భారత శాస్త్రీయ సంగీత పితామహుడి'గా, 'పండిట్ రవిశంకర్'ను 'ప్రపంచ సంగీత గాడ్‌ఫాదర్'గా, 'గులామ్ అలీ ఖాన్'ను 'కింగ్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్'గా, 'గిరిజా దేవి'ని 'క్వీన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్'గా, 'హరీష్ జయరాజ్'ను 'ఇండియన్ మెలొడి కింగ్'గా, 'సరోజనీదేవి/లతా మంగేష్కర్'లను 'గాన కోకిల'గా, పిలవడం జరుగుతోంది. పండిట్ రవిశంకర్ (సితార్), జాకీర్ హుసేన్ (తబ్లా), రామ్ నారాయణ్ (సారంగి), లతామంగేష్కర్ (సినీ/భక్తి సంగీతం), ఉస్తాద్ అసద్ అలీఖాన్ (రుద్రవీణ), రామ్‌నాథ్ రాఘవన్ (మృదంగం), వినాయక్రమ్ (ఘటమ్), భీంసేన్ దోషి (హిందుస్తానీ), హరిప్రసాద్ చౌరాసియా (ఫ్లూట్), బిస్మిల్లాఖాన్ (షెహ్నాయి), ఎం ఎస్ సుబ్బలక్ష్మి (కర్నాటక్ సంగీతం), పండిట్ శివకుమార్ శర్మ (సంతూర్ విధ్వంసులు), అమ్జద్ అలీ ఖాన్ (సరోద్) లాంటి మహానుభావులు భారత శాస్త్రీయ సంగీతాన్ని సుసంపన్నం చేశారు. సినీ సంగీత రంగంలో ఆశా భోంస్లే, అల్కా యాగ్నిక్, ఏ ఆర్ రెహమాన్, సోను నిగమ్, కిషోర్ కుమార్, మహ్మద్ రఫీ, మన్నాడే, ఎస్పీ బాలసుబ్రమణ్యం, ఉదిత్ నారాయణ్, శంకర్ మహదేవన్, యేసుదాస్ లాంటి మరెందరో ఉన్నారు. భారత అత్యున్నత పౌర పురస్కారం భారత రత్నను ఎం ఎస్ సుబ్బలక్ష్మి, ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్, భీమ్‌సేన్ దోషి, రవి శంకర్, లతామంగేష్కర్ లాంటి సంగీతకారులు అందుకోవడం మనకు తెలుసు.

### తెలుగు సంగీత కళాకారులు:

తెలుగు రాష్ట్రాల్లో అన్నమాచార్య, క్షేత్రయ్య, భక్త రామదాస్, త్యాగయ్య, ఈమని శంకరశాస్త్రి, చిన్న మౌలానా, చిట్టి బాబు, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, నెద్దునూరి కృష్ణమూర్తి, శ్రీరాగం గోపాలరత్నం, శ్రీపాద పినాకపాణి, నూకల చిన్న సత్యనారాయణ, అవసరాల కణ్యాకుమారి, లలిత హరిప్రియ,రాఘవాచారి, శేషాచారి, ఘంటశాల, మల్లపూడి లక్ష్మణరావు లాంటి అనేకులు మన తెలుగు సంగీతానికి ప్రాణం పోశారు. సినీ జగత్తును సంగీత సాగరంలో ముంచిన మహానుభావుల్లో ఘంటశాల, బాలసుబ్రహ్మణ్యం, సుశీల, జానకి, చిత్ర, కీరవాణి, మహదేవన్, కీరవాణి, రమేష్‌నాయుడు, చక్రవర్తి, మాదవపెద్ది సత్యం, ఆదినారాయణ, సత్యం, కోదండపాణి, హనుమంతరావు, రాజ్‌కోటి, మణిశర్మ, దేవి ప్రసాద్, చక్రం, ఆర్పీ పట్నాయక్, తమన్, కళ్యాణ్‌మాలిక్, వందేమాతరం శ్రీనివాస్ లాంటి మరెందరో సంగీతకారులు మనకు నిత్యం వీణులవిందు చేస్తూనే ఉన్నారు. తెలుగు రాష్ట్రాల్లో బుర్ర కథలు, ఒగ్గు కథలు, హరికథలు, జంగం కథలు, లంబాడీ గీతాలు, శారద కళ, చెక్క భజనలు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దులాటలు, పగటి వేషగాళ్లు, రోకటి పాటలు, కొమ్ము దాసరులు, సువ్వి పాటలు, తిరుగలి పాటలు, జమిడిక కథలు, శ్రామిక పాటలు లాంటి అనేక గ్రామీణ జానపదాలు మనకు నిత్యం మానసిక ప్రశాంతతను కలిగిస్తూనే ఉన్నాయి. సంగీతానికి సాహిత్యం తోడైతే అద్భుత సరాగాల ఝురి ప్రవహిస్తూ మానవాళిని ఆనంద డోలికల్లా ముంచేస్తుంది.

సంగీతానికి భాష, యాస అనబడే హద్దులు లేవు. పాటకు కుల మతభేదాలు లేవు. భాష ఏదైనా సుస్వరానికి లొంగని మనిషంటూ ఉండదు. నచ్చిన పాటకు పులకించని తనువుండదు. భక్తి సంగీతానికి పరవశించని నరుదుండడు. అలాంటి మన సంగీత వారసత్వాన్ని భవిష్యత్తు తరాలకు అందించడానికి తల్లితండ్రులు/ పెద్దలు తమ పిల్లలకు సంగీత పాఠాలు నేర్పించడం మంచిది. నిన్నటి తరం నిర్మించిన పునాదుల మీద మనం నిలిచాం, ఆ పునాదులను మరింత పటిష్ట పరచాల్సిన కనీస బాధ్యత మనందరి మీద ఉందని గుర్తుంచుకుందాం, మనదైన సంగీత సంపదను పరిరక్షించుకుందాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# రక్షణ రంగంలో ద్వైపాక్షిక బంధాన్ని బలపరిచేందుకు న్యూఢిల్లీలో భారత్ & వియత్నాం రక్షణ మంత్రుల సమావేశం

న్యూఢిల్లీ, జూన్ 20:భారత రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్, వియత్నాం రక్షణ మంత్రి జనరల్ ఫాన్ వాన్ గాంగ్ న్యూఢిల్లీలో ఇవాళ సమావేశం అయ్యారు. వివిధ ద్వైపాక్షిక రక్షణ రంగ సహకార కార్యక్రమాల్లో పురోగతిపై మంత్రులిద్దరు సమీక్షించి, సంతృప్తి వ్యక్తం చేశారు.

ఇప్పటికే భాగస్వామ్యం కొనసాగుతున్న రంగాలను, ప్రత్యేకించి రక్షణ రంగ పరిశ్రమల మధ్య సహకారం, సముద్ర భద్రత, బహుళజాతి సహకారం అంశాల్లో సంబంధాలను పెంచుకునే మార్గాలపై చర్చలు జరిగాయి. వియత్నాం పీపుల్స్ నేవీ సామర్థ్యాన్ని పెంచే విషయంలో ఒక మైలురాయిగా నిలిచేలా, స్వదేశీ నిర్మిత ఇన్-సర్వీస్ మిస్సైల్ ఐఎన్ఎస్ కిర్పాన్‌ను బహుమతిగా ఇస్తున్నట్లు భారత రక్షణ మంత్రి ప్రకటించారు.

తన పర్యటనలో భాగంగా, వియత్నాం రక్షణ మంత్రి డీఆర్‌డీవో ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. రక్షణ పరిశోధన, ఉమ్మడి ఉత్పత్తిలో సహకారం ద్వారా రక్షణ పారిశ్రామిక రంగ సామర్థ్యాలను పెంపొందించే మార్గాల గురించి చర్చించారు.

దీనికి ముందు, జాతీయ యుద్ధ స్మారకం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి అమర వీరులకు జనరల్ ఫాన్ వాన్ గాంగ్ నివాళులు అర్పించారు. ఆయన, రెండు రోజుల పర్యటన కోసం ఈ నెల 18న భారతదేశానికి వచ్చారు. భారతదేశ 'యాక్ట్ ఈస్ట్ పాలసీ'తో పాటు ఇండో-పసిఫిక్ ప్రాంతంలో వియత్నాం ఒక ముఖ్యమైన భాగస్వామ్య దేశం.

# తాళం వేసిన ఇండ్లే టార్గెట్.. నాలుగు జిల్లాల్లో దోపిడీలు చేస్తున్న ఇద్దరు అరెస్టు

అమరావతి, జూన్ 20:: తాళం వేసిన ఇళ్లే వారి టార్గెట్. ఇళ్లకు తాళాలు వేసి ఎక్కడికైనా వెళ్లారో.. మీరు వచ్చేనరికి ఇళ్లు గుల్ల కావాల్సిందే. వారి కన్ను పడిందంటే చాలు.. ఎంతటి తాళమైనా ఇట్టే ఊడిపోతుంది. ఇట్లా నాలుగు జిల్లాల్లో అప్రతిహతంగా దోపిడీలకు తెగబడుతున్న దొంగలను ముత్తుకూరు పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు.

నెల్లూరు జిల్లాతో పాటు చిత్తూరు, కడప, ప్రకాశం జిల్లాల్లో దొంగతనాలు చేస్తున్న అంతర్‌జిల్లా దొంగలను ముత్తుకూరు పోలీసులు పట్టుకున్నారు. ఇందులో సునీల్‌పై ఇప్పటికే 45 కేసులున్నాయి. ఈ నేపథ్యంలో ఇవ్వాల (మంగళవారం) సాయంత్రం రూరల్ డీఎస్పి వీరాంజనేయరెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు. నెల్లూరు సిటీకి చెందిన పాత నేరస్థుడు సునీల్ అనేక దొంగతనాలు చేసి జైలు శిక్ష అనుభవించి బయటకు వచ్చాడు. దేవరపల్లి సురేష్ అనే మరో దొంగతో పరిచయం పెంచుకొని మళ్లీ చోరీలు, దోపిడీలు చేయడం ప్రారంభించారు.

ముత్తుకూరు మండలంలో కూడా పలు ప్రాంతాల్లో ఇద్దరు కలిసి దొంగతనాలు చేశారు. తాళం వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేసి దూరిపోవడం, బంగారు, వెండి నగలు దోచేసి చెడు వ్యసనాలకు ఖర్చు పెట్టడం అలవాటుగా చేసుకున్నారు. ఈ దొంగలను మల్లూరు సెంటర్ వద్ద ముత్తుకూరు పోలీసులు అరెస్ట్ చేసినట్లు డి.ఎస్.పి తెలిపారు. వీరి నుంచి సుమారు 15 లక్షల రూపాయలు విలువచేసే బంగారం నగలు, రెండు కేజీలు వెండి, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. 2011 నుంచి పాత నేరస్థుడు దొంగతనాలు చేయడం అలవాటుగా పెట్టుకున్నాడని తెలిపారు.

# నకిలీ పత్తి విత్తనాల విక్రయం.. ఇద్దరి అరెస్ట్




వరంగల్, జూన్ 20:నకిలీ పత్తి విత్తనాల విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను టాస్క్ ఫోర్స్ , దేవరుప్పుల పోలీసులు ..వ్యవసాయశాఖ విభాగం అధికారులతో కలిసి అరెస్టు చేశారు. వారి నుండి లక్ష మూడు వేల ఐదు వందల యాభై రూపాయల విలువ గల 40 కిలోల నకిలీ విడి విత్తనాలు .. బుల్లెట్ -5ఉ రకానికి చెందిన 23 నకిలీ పత్తి విత్తనాల పాక్కెట్స్ ను స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్ట్ కి సంబందించిన వివరాలను టాస్క్ ఫోర్స్ ఏ సి పి ఏం. జితేందర్ రెడ్డి వెల్లడించారు. నేడు నకిలీ విత్తనాలు సరఫరా అవుతున్నాయనే పక్కా సమాచారంతో దేవరుప్పుల బస్ స్టేజ్ వద్ద .. టాస్క్ ఫోర్స్ .. దేవరుప్పుల పోలీసులు తనిఖీ నిర్వహించారు. కాగా అనుమానస్పదంగా ఇద్దరు వ్యక్తులు రెండు మూటలతో కనిపించగా వాటిని తనిఖీ చేసి, వారి వద్ద నుండి వాటిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా, తాము గతంలో కామారెడ్డి గ్రామనికి చెందిన రామారావు అనే వ్యకికి 25 కిలోల నకిలీ విత్తనాలు ఇచ్చామని సమాధానం చెప్పారు. కాగా నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఇన్ స్పెక్టర్లు కె. శ్రీనివాసరావు, కె. జనార్ధన్ రెడ్డి, సత్యనారాయణ, రాంబాబు ..ఎస్సైలు పి. దేవేందర్, బి. శరత్ కుమార్, వి. లవన్ కుమార్, డి. రాజు మరియు టాన్క్ ఫోర్స్ సిబ్బందిని అబినందిచారు.

# చేతి వృత్తి కళాకారుల సంక్షేమం కోసం 'గ్రామ వికాస్ యోజన' కింద కేవీఐసీ అనేక కార్యక్రమాలను అమలు చేస్తోంది - కేవీఐసీ చైర్మన్ శ్రీ మనోజ్ కుమార్

హైదరాబాద్, జూన్ 20:ఖాదీ మరియు గ్రామ పరిశ్రమల కమిషన్ (కేవీఐసీ) ( కేంద్ర ఎంఎస్‌ఎంఈ అనుబంధ సంస్థ) తెలంగాణ రాష్ట్ర కార్యాలయం ఈరోజు హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడలో ఉన్నరాష్ట్ర కార్యాలయంలో గ్రామోద్యోగ్ వికాస్ యోజన కింద అవగాహన, టూల్‌కిట్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో కెవిఐసి చైర్మన్ శ్రీ మనోజ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంస్థ నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పొందిన తెలంగాణకు చెందిన 300 మందికి శ్రీ మనోజ్ కుమార్ పనిముట్లను ఉచితంగా పంపిణీ చేశారు. పేపర్ ప్లేట్ తయారీ, పేపర్ బ్యాగ్ తయారీ, అగర్బత్తి తయారీ, చింతపండు ప్రాసెసింగ్, లెదర్ కళాకారులు, గిరిజన తేనెటీగల పెంపకం రంగంలో వీరు శిక్షణ పొందారు.

ఈ సందర్భంగా మాట్లాడిన కేవీఐసీ చైర్మన్ శ్రీ మనోజ్ కుమార్ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం పటిష్టమైన, సమర్ధవంతమైన దేశంగా అభివృద్ధి సాధిస్తూ ప్రపంచ దృష్టి ఆకర్షిస్తోంది అన్నారు.

స్వతంత్ర భారత చరిత్రలో తొలిసారిగా ఖాదీ, గ్రామ పరిశ్రమల కమిషన్ ఉత్పత్తుల టర్నోవర్ రూ. 1.34 లక్షల కోట్లకు చేరుకుంది అని ఆయన చెప్పారు. గత 9 ఆర్థిక సంవత్సరాల్లో గ్రామీణ ప్రాంతాల్లోని చేతివృత్తుల వారు తయారు చేసిన దేశీయ ఖాదీ ఉత్పత్తుల అమ్మకాలు రికార్డు స్థాయిలో 332% వృద్ధి నమోదు చేశాయని తెలిపారు. భారతదేశం స్థానిక స్థాయి నుంచి ప్రపంచ స్థాయికి ఎదగాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆకాంక్ష నెరవేరేలా చేసేందుకు మేక్ ఫర్ ది వరల్డ్‌తో పాటు మేక్ ఇన్ ఇండియా నినాదంతో ముందుకు సాగాలని ఆయన అన్నారు. చేతివృత్తుల వారు తమకు అందిన యంత్రాలు, టూల్‌కిట్‌లను సద్వినియోగం చేసుకుని వీలైనంత ఎక్కువ ఉపాధి అవకాశాలను కల్పించి స్వయం సమృద్ధి భారత్ నిర్మాణానికి సహకరించాలని కోరారు.

చేతి వృత్తి కళాకారుల సంక్షేమం కోసం కెవిఐసి 'గ్రామ వికాస్ యోజన' కింద అనేక కీలక కార్యక్రమాలను అమలు చేస్తోందని శ్రీ మనోజ్ కుమార్ తెలిపారు. నైపుణ్య శిక్షణ తో పాటు ఉచితంగా పనిముట్లు, యంత్రాలు అందించడం ద్వారా చేతివృత్తుల వారి అభ్యున్నతికి సహకరించడం పథకం లక్ష్యమని తెలిపారు. గత మూడేళ్లలో తెలంగాణలో దాదాపు 1500 మంది కళాకారులు ఈ పథకం ద్వారా లబ్ది పొందారని, నిరుద్యోగ యువత కేవీఐసీ అందిస్తున్న పలు పథకాలను వినియోగించుకుని స్వయం ఉపాధి పొందాలని సూచించారు.

కార్యక్రమంలో భాగంగా శ్రీ.మనోజ్ కుమార్ తెలంగాణలో అమలు చేయనున్న ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (ఖఓఇఉఖ) మార్జిన్ మనీ(సబ్సిడీ) రూ. 100 కోట్ల మొత్తాన్ని కూడా విడుదల చేశారు. దీని ద్వారా దాదాపు 3000 మంది పారిశ్రామికవేత్తలు ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక మందికి ఉపాధి కల్పించనున్నారు. వనపర్తి జిల్లాలో రూ. 2 కోట్లతో రెడీమేడ్ గార్మెంట్స్ క్లస్టర్‌ను కెవిఐసి ద్వారా స్కీమ్ ఆఫ్ ఫండ్ ఫర్ రిజనరేషన్ ఆఫ్ ట్రెడిషనల్ ఇండస్ట్రీస్ (ాఈజఖీఎ) పథకం కింద మంజూరు చేశారు. వనపర్తి జిల్లాలో ఈ క్లస్టర్‌కు ఆమోదం లభించిందని, ఇక్కడ 150 మంది చేతి వృత్తిదారులకు లబ్ధి చేకూరుతుందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా జిఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ 2023-24 సంవత్సరానికి నైపుణ్య శిక్షణను అందించడానికి ఖాదీ మరియు విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్‌తో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందంపై సంతకాలు జరిగాయి.

కేవీఐసీ జోనల్ డిప్యూటీ సీఈఓ శ్రీ ఆర్.ఎస్.. పాండే, తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ మనోజ్ లంక, కెవిఐసి రాష్ట్ర అధికారులు, ఎన్ఐ-ఎంఎస్ఎంఇ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎన్. గ్లోరీ స్వరూప కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 'యువ నిపుణుల కోసం దక్షత' ఇప్పుడు ఐ గాట్ కర్మయోగిలో నిరంతర అందుబాటు

న్యూఢిల్లీ, జూన్ 20:యువ నిపుణుల కోసం దక్షత కొత్త నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోర్స్ సేకరణ (ప్రభుత్వ నిర్వహణ లో సంపూర్ణ పరివర్తన కోసం మనోవైఖరి, జ్ఞానం, నైపుణ్యం అభివృద్ధి) ఇప్పుడు ఐ గాట్ కర్మయోగి ప్లాట్‌ఫామ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయబడుతోంది. ప్రభుత్వంలో నిమగ్నమైన యువ నిపుణులు మరియు కన్సల్టెంట్‌ల కోసం రూపొందించబడిన (18 కోర్సులతో కూడినది) ఈ సేకరణ అభ్యాసకులు వారి విధులను మరియు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడానికి కీలకమైన విషయాలను పరిచయం చేయడం ద్వారా క్రియాత్మక, రంగం మరియు ప్రవర్తనా సామర్థ్యాలను పెంపొందించడానికి ప్రయత్నిస్తుంది.

ప్రస్తుతం, నీతి ఆయోగ్‌లోని 40 మంది యువ నిపుణులు మరియు కన్సల్టెంట్‌లు ఐ గాట్ కర్మయోగి ప్లాట్‌ఫామ్‌లో ఈ క్యూరేటెడ్ కోర్సుల సేకరణ ద్వారా దశల వారీగా ఉద్యోగ శిక్షణ పొందుతున్నారు.

చేర్చబడిన 18 కోర్సులు:

ప్రభుత్వం కోసం డేటా-ఆధారిత నిర్ణయం తీసుకోవడం (వాధ్వాని ఫౌండేషన్), ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళి, మిషన్ లైఫ్‌పై అవగాహన మాడ్యూల్ , ఆఫీస్ విధి విధానాలు, ఆఫీస్ లో యోగా బ్రేక్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ , పౌర విధాన పరిశోధన ప్రాథమిక అంశాలు, అడ్వాన్స్‌డ్ పవర్‌పాయింట్ (మైక్రోసాఫ్ట్), పని ఒత్తిడి నిత్తట్టుకోవడం, వర్క్‌ప్లేస్‌లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ , నోటింగ్ ఉ డ్రాఫ్టింగ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ , పౌర విధాన రూపకల్పన, వ్యక్తిగత ఉ సంస్థాగత విలువలు, భారత్ లో సంస్కరణలు, భారత్ లో ప్రభుత్వ కొనుగోళ్లు (వ్యయ విభాగం), మెరుగైన ప్రెజెంటేషన్ స్కిల్స్ కు మార్గాలు మరియు అడ్వాన్స్‌డ్ ఎక్సెల్ (మైక్రోసాఫ్ట్).

వివిధ మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ విభాగాలు మరియు సంస్థలలో నిమగ్నమైన యువ నిపుణులు మరియు కన్సల్టెంట్‌లు వారి జ్ఞానం, నైపుణ్యాలు మరియు సామర్థ్యాలను మెరుగుపరచుకోవడానికి ఐ గాట్ కర్మయోగి ప్లాట్‌ఫామ్‌లో క్యూరేటెడ్ కోర్సుల సేకరణ అందుబాటులో ఉంది.

ఐ గాట్ కర్మయోగి ప్లాట్‌ఫామ్ అనేది ప్రభుత్వ అధికారులకు వారి సామర్థ్యాన్ని పెంపొందించే ప్రయాణంలో మార్గనిర్దేశం చేసేందుకు ఒక సమగ్రమైన ఆన్‌లైన్ పోర్టల్. ఆన్‌లైన్ శిక్షణ, సామర్థ్య నిర్వహణ, కెరీర్ మేనేజ్‌మెంట్, చర్చలు, ఈవెంట్‌లు మరియు నెట్‌వర్కింగ్ కోసం పోర్టల్ 6 ఫంక్షనల్ హబ్‌లను మిళితం చేస్తుంది.

విక్షిత్ భారత్‌ను నిర్మించాలనే ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా, మిషన్ కర్మయోగి (జాతీయ పౌర సేవల సామర్థ్యం పెంపుదల కార్యక్రమం) తెలివైన, స్నేహపూర్వక పౌర సేవలు మరియు భవిష్యత్తు-సన్నద్ధత తో పౌర సిబ్బంది కి సామర్థ్య నిర్వహణ లో ఆన్‌లైన్ శిక్షణ లో సమగ్ర పాత్ర పోషిస్తోంది.

మిషన్ యొక్క ప్రధాన లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడం కోసం సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు మరియు పెన్షన్ల మంత్రిత్వ శాఖ డీ ఓ పీ టీ ద్వారా కర్మయోగి భారత్ ప్రభుత్వ యాజమాన్యంలోని లాభాపేక్ష లేని ఎస్ పీ వీ గా స్థాపించబడింది. ఐ గాట్ (ఇంటిగ్రేటెడ్ గవర్నమెంట్ ఆన్‌లైన్ ట్రైనింగ్) కర్మయోగి ప్లాట్‌ఫామ్‌ను మెరుగుపరచడం యాజమాన్యం, నిర్వహణ మరియు బాధ్యతలను అప్పగించింది.

# తెలంగాణ రాష్ట్ర హ్యాట్రిక్ సిఎంగా కేసీఆర్

## సింగరేణి కార్మికుల వారసుల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత సిఎం కేసీఆర్

## - సింగరేణి కార్మికులు... బార్డర్లో సైనికులతో సమానం- రామగుండం ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని ప్రతినిధి, జూన్ 20: అనాటి ప్రభుత్వాలు కార్మిక సంఘులు పోగోట్టిన వారసత్వ ఉద్యోగాలను తిరిగి కారుణ్య నియమాకాల ద్వారా సింగరేణి కార్మికుల వారసులకు ఉద్యోగాలు కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దే అని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. తెలంగాణ ఆవతరణ దశాబ్ది ఉత్సవాలు, రామగుండం దశాబ్ది ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా మంగళవా రం ఆర్జీ వన్ ఏరియా సివిల్ డిపార్ట్‌మెంట్ లో ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమంలో అమరులైన ఆమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణసింగరేణి గని కార్మికుంటే సిఎం కేసీఆర్ కు అమితమైన అభిమానమని... సింగరేణి కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్న సిఎం కేసీఆర్ కార్మికులకు కొండంతా అండగా నిలుస్తున్నరని అన్నారు. రక్తాన్ని చెమటగా మార్చి తమ జీవితాలను పణంగా పెట్టి వెలుగులు అందిస్తున్న సింగరేణి గని కార్మికులు బార్డర్లో సైనికులతో సమానం అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ నేతృత్వంలో 14 ఏళ్ల పాటు అలుపెరుగని తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని సాగించి పట్టువదలనీ విక్రమార్కుడి వలే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించామని అన్నారు. 2001 సంవత్సరం ప్రొపెసర్ జయశంకర్ సార్ రాసిన తల్లడిల్లు తున్న తెలంగాణ పుస్తకం చదివి తాము ఉద్యమ ప్రస్తానం ప్రారంభిం చామని చెప్పారు. 14 ఎళ్ల పాటు స్వరాష్ట సాధన కోసం అలుపెరగని పోరాటం సాగించామని వందలాది కేసులు పెట్టిన రాష్ట్ర కోసం పోరాటం సాగించామని గుర్తు చేసారు. తెలంగాణ ఉద్యమంలో గని కార్మికు ల పాత్ర మరువలేనిదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవతరణ అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ మార్గనిర్దే శం లో సింగరేణి




సంస్థ లాభాల్లో గొప్పగా సాధించిందని అన్నారు. గత సంవత్సరం ఫిల్టర్ బెడ్ లో విధులు నిర్వహిస్తున్న 5 గురు సివిల్ కార్మికులు వరదల చిక్కుకున్న సందర్భంలో రెస్క్యూ సిబ్బందితో కలసి కార్మికన్నాల ప్రాణాలే ముఖ్యంగా భావించి తమ ప్రాణాలను సైతం లెక్క చెయకుండా వారిని కపాడటం జరిగిం దన్నారు. సింగరేణి కార్మికన్నాలంటే తమకు అమితమైన అభిమానమని వారి కోసమే ఎంత దూరమైన తాము వేళ్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సకలజనులందరికి సిఎం కేసీఆర్ పై వారి పాలనపై పూర్తి విశ్వాసం ఉందని 2024లో తెలంగాణ రాష్ట్రానికి సిఎం కేసీఆర్ హ్యాట్రిక్ సిఎం కావడం ఖాయమన్నారు. అనంతరం ఇతర యూనియన్లకు చెందిన పుల్లూరి సాగర్,లక్ష్మయ్య, మహర్షి,రవి ఎమ్మెల్యే గారి సమక్షంలో టి.బి.జి.కె.ఎస్ యూనియన్ లో చెరాగా వారిని ఎమ్మెల్యే యూనియన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కెంగర్ల మల్లయ్య, దామోదర్, దాసరి శ్రీనివాస్, చెంద్రయ్య, వెంకటేష్, వడ్డేపల్లి శంకర్, శేషగిరి, మంద రమేష్, పుట్ట రమేష్ గండు శ్రావన్ మల్లారెడ్డి, మాదాసు రామమూర్తి, మారుతి, గుంపుల ఓదేలు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం

సనత్‌నగర్ జూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగింది. ఉదయం 9.30 గంటలకు ఈ కల్యాణోత్సవం ప్రారంభమైంది. ఎల్లమ్మ అమ్మవారి కల్యాణాన్ని ప్రజలు టీవీల్లో వీక్షించేలా ప్రత్యక్ష ప్రసారం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకునేలా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏటా ఆషాడ మాసం మొదటి మంగళవారం బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణం అత్యంత వైభవంగా జరుగుతుంది. కల్యాణానికి ప్రభుత్వం తరఫున మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కుటుంబసమేతంగా హాజరై పట్టువస్త్రాలు సమర్పించారు. కాగా, అమ్మవారి కల్యాణాన్ని తిలకించేందుకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా భక్తులు భారీగా కల్యాణోత్సవానికి విచ్చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.అయితే, బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం ఘనంగా ఎదుర్కోళ్లు నిర్వహించారు. ఇవాళ అంగరంగ వైభవంగా ఎల్లమ్మ కల్యాణం చేస్తున్నారు. చివరిగా రేపు సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తారు.

# జీ-20 నిర్వహించనున్న కార్యక్రమాన్ని ప్రారంభించనున్న డాక్టర్ మన్సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ, జూన్ 20:'హెల్త్ ఆఫ్ యూత్-వెల్త్ ఆఫ్ నేషన్' అనే అంశంపై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తల్లి, నవజాత, శిశు సంక్షేమం కోసం పనిచేస్తున్న పీఎంఎన్ సీ హెచ్ సహకారంతో 2023 జూన్ 20న సమావేశాన్ని నిర్వహిస్తుంది. జీ-20 సమావేశాల్లో భాగంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సమావేశం న్యూఢిల్లీలో జరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 1.8 బిలియన్ యుక్త వయస్కులు, యువత ఆరోగ్యం, శ్రేయస్సు అంశాలపై సమావేశం ప్రధానంగా దృష్టి సారించి చర్చలు జరుపుతుంది. యుక్త వయస్కులు, యువత కు సంబంధం ఉన్న రంగాల్లో జీ-20 దేశాల తో పాటు ఇతర దేశాలు ప్రాధాన్యత ఇచ్చి తగిన నిధులు కేటాయించేలా చూసే అంశానికి ప్రాధాన్యత ఇచ్చి సమావేశంలో చర్చలు జరుగుతాయి.

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ సమావేశాన్ని ప్రారంభించి కీలక ప్రసంగం చేస్తారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత శాఖ మంత్రి, శ్రీ ధర్మేంద్ర ప్రధాన్, సమాచార, ప్రసార, క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ అనురాగ్ ఠాకూర్, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి, ప్రొఫెసర్ ఎస్.పి. సింగ్ బఘేల్, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ కూడా సమావేశానికి హాజరవుతారు.యువత ఎదుర్కొంటున్న సవాళ్లు ఎదుర్కోవడం, యువత ఆరోగ్యం, సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను మంత్రులు వివరిస్తారు. దక్షిణాఫ్రికా ఆరోగ్య మంత్రి డాక్టర్ మాతుమ్ జోసెఫ్ 'జో' ఫాహ్లా ప్రారంభ సెషన్‌లో ప్రసంగిస్తారు.

ప్రపంచం మొత్తం మీద 10-24 సంవత్సరాల వయస్సు గల 1.8 బిలియన్ల మంది నివసిస్తున్నారు. ప్రపంచ దేశాలతో పోలిస్తే భారతదేశంలో అత్యధిక యువజన జనాభా ఉంది. యువత ఏ దేశానికైనా విలువైన ఆస్తిగా ఉంటారు. యువత ఆరోగ్యం, శ్రేయస్సు సంబంధించిన అంశాలపై పెట్టే పెట్టుబడి ఆర్థిక వృద్ధి, అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. దేశ జనాభాలో యువత ప్రాధాన్యతను జీ-20 గుర్తించింది. ఢిల్లీ వేదికగా జరిగే సమావేశంలోకొమారదశలో ఉన్నవారు, యువత ఆరోగ్యం, శ్రేయస్సు కోసం పెట్టుబడి పెట్టవలసిన అవసరాన్ని ప్రధానముగా చర్చిస్తారు. దేశాభివృద్ధిలో కీలకంగా ఉండే యువ శక్తి పై నమ్మకం ఉంచి వారి శారీరక, మానసిక , సామాజిక శ్రేయస్సు అందించాలన్న ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ భావాలకు అనుగుణంగా సమావేశం జరుగుతుంది. దేశ ఆర్థికాభివృద్ధిలో యువతకు తగిన ప్రాధాన్యత ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం పథకాలు, కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తోంది.

సమాజంలో సానుకూల మార్పు తీసుకు వచ్చే విధంగా యువతను శక్తివంతం చేయడం,జీ-20 దేశాల నుండి విధాన రూపకర్తలు, భాగస్వామ్య అధికారులు, నిపుణులు, భాగస్వామ్య సంస్థలు, యువత ప్రతినిధుల మధ్య చర్చలు జరిగే విధంగా చూసి అవగాహన పెంపొందించడం, లక్ష్యంగా జరుగుతున్న కార్యక్రమంలో పాల్గొనే ప్రతినిధులలో దాదాపు మూడింట ఒక వంతు మంది భారత దేశంలో వివిధ ప్రాంతాలు, జీ-20 సభ్య దేశాలకు చెందిన యువకులు ఉంటారు.పెద్ద సంఖ్యలో యువత ప్రతినిధులు పాల్గొనడం వల్ల యువత ఆరోగ్యం, శ్రేయస్సుకు సంబంధించిన అంశాలు ప్రముఖంగా చర్చకు వస్తాయి. యువ ప్రతినిధులు అందించే సలహాలు, సూచనలు, అభిప్రాయాలకు అనుగుణంగా భవిష్యత్ విధాన సూత్రీకరణలు కార్యాచరణ ప్రణాళిక రూపొందుతాయి.

ఈ కార్యక్రమంలో కౌమార ఆరోగ్యం మరియు శ్రేయస్సుపై దృష్టి సారించే రెండు సాంకేతిక సదస్సులు, యువత భాగస్వామ్యానికి సంబంధించి చర్చలు జరుగుతాయి. విధాన రూపకల్పనలో యువకుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే విధంగా ప్రత్యేక కార్యక్రమం జరుగుతుంది.జీ-20 దేశాలకు చెందిన యుక్త వయస్కులు, యువత ఆరోగ్యం , శ్రేయస్సును మెరుగుపరచడానికి సహకరించే విస్తృత విధానాలు, కార్యక్రమాలను చర్చించడానికి మరో సమావేశాన్ని నిర్వహిస్తారు. జీ-20 షెర్పా శ్రీ అమితాబ్ కాంత్, కేంద్ర ఆరోగ్య కార్యదర్శి శ్రీ రాజేష్ భూషణ్, పీఎంఎన్ సి హెచ్ బోర్డ్ చైర్‌పర్సన్ హెలెన్ క్లార్క్,జబిఅంఆ హెడ్క్వార్టర్ డైరెక్టర్ డాక్టర్ జులిట్ అనబాంతోతో సహా జీ-20 దేశాలకు చెందిన నిపుణులు సమావేశంలో జరిగే ప్రత్యేక చర్చల్లో పాల్గొంటారు.

# ప్రపంచాన్ని మార్చడానికి విద్యను మించిన ఆయుధం మరొకటి లేదు: లిల్లీ మేరి

సిద్దిపేట జూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్): 'ప్రపంచాన్ని మార్చడానికి విద్యను మించిన ఆయుధం మరొకటి లేదు' అనే నెల్సన్ మండేలా సూక్తి అక్షరాలా నిజం చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము విద్యాభివృద్ధికి అనేక చర్యలు చేపట్టిందని, నాణ్యమైన విద్యను అందించడం ద్వారా సామాజిక అభివృద్ధి పునాదులను బలోపేతం చేయడానికి కృషి చేస్తుందని తెలంగాణ విద్యార్థులను ప్రపంచ స్థాయిలో పోటీపడే విధంగా తీర్చిదిద్దుతుందని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ లిల్లీ మేరి అన్నారు.

ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో జరిగిన తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగముగా విద్యా దినోత్సవ సందర్భంగా శ్రీమతి లిల్లీ మేరి మాట్లాడుతూ ప్రతి పేద పిల్లవాడు చదువుకునే విధంగా, ఆ బాధ్యతను ప్రభుత్వమే స్వీకరించే విధంగా నూతన విద్యా విధానాన్ని అవలంబిస్తుందన్నారు.

విద్యా రంగము సామాజిక, శ్రేయోరంగము అక్కడ భావితరాలను వారి నైపుణ్యాలను రూపొందించడమే తప్ప, లాభనష్టాల లెక్క ఉండదని భావించిన మన ముఖ్యమంత్రి కెసిఆర్ గారు దేశానికి, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచే అనేక పథకాలను ప్రభుత్వ విద్యా రంగంలో ప్రవేశపెట్టారన్నారు.

# విద్య దినోత్సవం.. పాలకుర్తిలో మంత్రి ఎర్రబెల్లి విస్తృత పర్యటన



వరంగల్, జూన్ 20:రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా తెలంగాణ విద్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నేడు పాలకుర్తి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పలు పాఠశాల భవనాలను, గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభిస్తున్నారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం రంగరాయగూడెంలో స్థానిక శాసనసభ్యులు డాక్టర్ తాటికొండ రాజయ్యతో కలిసి అంగన్‌వాడీ పాఠశాలను ప్రారంభించారు. కొడకండ్ల మండలం లక్ష్మక్కపల్లి గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలను, పెద్ద బాయి తండా గ్రామ పంచాయతీ భవనాన్ని, పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో బాలుర రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీని, హై స్కూల్లో డిజిటల్ తరగతులను ప్రారంభించారు.

ఈ వేడుకల్లో జనగామ జిల్లా కలెక్టర్ శివ లింగయ్య, ఆయా శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజలు, విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. తొర్రూరు మండలం కర్కాల గ్రామంలో బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. తొర్రూరు మండలం కర్కాల గ్రామంలో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తారు. పెద్ద వంగర మండలం చిట్యాల గ్రామంలో ప్రాథమిక పాఠశాలను ప్రారంభించి, విద్య దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. పాలకుర్తి నియోజకవర్గం పెద్ద వంగర మండలం బావోజీ తండా లో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తారు. పెద్ద వంగర మండలం చిన్న వంగర గ్రామంలో నూతన కస్తూర్బా పాఠశాల భవనాన్ని ప్రారంభించి, విద్య దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. తదుపరి కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారు.

# విద్యారంగంలో తెలంగాణ దేశానికే రోల్‌మోడల్ : మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్, జూన్ 20:తెలంగాణ స్వరాష్ట్రంగా ఆవిర్భవించిన తర్వాత ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయటానికి సీఎం కేసీఆర్ అనేక చర్యలు తీసుకున్నారని అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. గురుకులాలు అద్భుతమైన ఫలితాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారయని తెలిపారు. విద్యారంగంలో తెలంగాణ దేశానికే రోల్‌మోడల్‌గా మారుతున్నదని పేర్కొన్నారు.దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న విద్యాదినోత్సవం సందర్భంగా 'మన ఊరు-మన బడి' కార్యక్రమంలో నిర్మల్ పట్టణంలో నూతనంగా నిర్మించిన శాంనగర్, సోఫినగర్ పాఠశాలను మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగం ప్రగతిబాటలో ముందుకు సాగుతున్నదని, తొమ్మిదేళ్ళలో ఊహించని విధంగా విద్యాభివృద్ధిలో పురోగతి సాధించిందని పేర్కొన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యారంగాన్ని తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో విద్యా బోధన, మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. సీఎం కేసీఆర్ దూరదృష్టితో గ్రామీణులకు, పేదలకు నాణ్యమైన ఇంగ్లీష్ మీడియం విద్యను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఒకపక్క ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ.. మరోపక్క సంక్షేమ శాఖల వారీగా కొత్తగా గురుకుల పాఠశాలలను నెలకొల్పుతూ సత్ఫలితాలు సాధిస్తున్నామని వివరించారు.

అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న దాదాపు 25 లక్షల మంది విద్యార్థులకు రూ. 140 కోట్లతో రెండు జతల యూనిఫామ్స్, రూ. 190 కోట్లతో ఉచితంగా టెక్స్ట్ బుక్స్, సంవత్సరం పొడవునా రూ. 35 కోట్ల ఖర్చుతో రాగి జావా ఇవ్వాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారని పేర్కొన్నారు. 12 లక్షల 50 వేల మంది విద్యార్థులకు రూ. 56 కోట్ల విలువ గల నోట్ బుక్స్, 34.25 కోట్ల విలువ చేసే ట్యాబ్స్ 19,800 మంది టీచర్స్‌కు అందించనున్నామని వెల్లడించారు



# మున్సిపాలిటీ కౌన్సిలర్ గిత్తల దేవరాజ్ ఘనంగా సత్కారం



జోగులాంబ గద్వాల జూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఉత్తమ అవార్డు అందుకున్న ఐజ మున్సిపాలిటీ కౌన్సిలర్ గిత్తల దేవరాజ్ ను జోగులాంబ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తట్టే మహేష్ ఘనంగా సత్కరించారు. ఇట్టి కార్యక్రమంలో రాష్ట్ర ఓబిసి కార్యదర్శి మాస్టర్ షేక్షావలి ఆచారి గారు, జోగులాంబ జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. సాంబశివుడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాండురంగ, తూముకుంట కేకే బసవరాజ్, సుందర్ రాజ్, బాలకృష్ణ పాల్గొన్నారు

# లక్ష సాయం దరఖాస్తుల గడువు పెంచేది లేదు.. విడతల వారీగా సహాయం చేస్తాం: మంత్రి గంగుల

హైదరాబాద్, జూన్ 20: బీసీలకు ఆర్థికసాయం రూ.లక్ష అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన పథకానికి గడువు మంగళవారంతో ముగిసిపోయింది. ఇప్పటికే అభ్యర్థులు లక్షల్లో దరఖాస్తు చేసుకుంటే ఇంకా చేసుకోని వారు ఇంకా ఎక్కువే ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గడువు పెంచుతుందని ఆశగా ఎదురుచూస్తున్న బీసీలకు నిరాశే మిగిలింది. దరఖాస్తు గడువు పెంచేది లేదని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ ఈమేరకు స్పష్టం చేశారు.

అయితే ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిశీలిస్తామని మంత్రి తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు జూలై 15న ఆర్థిక సాయం చెక్కులను పంపిణీ చేస్తామన్నారు. బీసీ రుణాల పంపిణీ నిరంతరం జరిగే ప్రక్రియ అని ఈ రుణాలకు మళ్లిట దరఖాస్తులు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. విడతల వారీగా సహాయం అందిస్తామని, మరో విడత దరఖాస్తులకు మరో గడువు తేదీ ఉంటుందని వెల్లడించారు.

# విచారణకు రావాలంటూ బీఆర్ఎస్ నేతలకు ఐటీ నోటీసులు

హైదరాబాద్ జూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఐటీ విచారణకు రావాలంటూ బీఆర్ఎస్ నేతలకు నోటీసులు అందాయి. 84 గంటల పాటు పైళ్ల శేఖర్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లోనూ ఐటీ ముమ్మర తనిఖీలు నిర్వహించింది. సోదాల్లో స్వాధీనం చేసుకున్న పలు డాక్యుమెంట్స్, ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్స్ ఆధారంగా పైళ్ల శేఖర్‌రెడ్డికి ఐటీ నోటీసులు జారీ చేసింది. నేడు సంబంధిత వివరాలు, ఆధారాలతో హైదరాబాద్‌లోని ఐటీ ఆఫీస్‌లో విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో ఐటీ అధికారులు పేర్కొన్నారు.

శేఖర్‌రెడ్డితోపాటు జనార్దన్‌రెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి కూడా నోటీసులు ఇచ్చినట్టు సమాచారం. అయితే నేడు ఐటీ ముందు ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి హాజరు కానున్నారు. మర్రి జనార్దన్ రెడ్డి సమయం కోరనున్నారు. ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డిని గురువారం హాజరు కావాలని ఐటీ అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు.అధికార బీఆర్ఎస్ పార్టీ నేతలను ఆదాయ పన్ను (ఐటీ) శాఖ అధికారులు హడలెత్తించారు. 50 బృందాలుగా ఏర్పడిన అధికారులు ఏకకాలంలో బీఆర్ఎస్ ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్యేలు, మరో నాయకుడి ఇళ్లలో సోదాలు చేశారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, నాగర్‌కర్నూలు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, బీఆర్ఎస్ ముషీరాబాద్ నియోజకవర్గ నాయకుడు కొండపల్లి మాధవ్ (ఈయన 20 ఏళు బీజేపీలో ఉన్నారు) ఇళ్లలో దాడులు చేశారు. ఆదాయ పన్ను లెక్కల్లో తేడాలుండడంతోనే ఈ సోదాలు చేసినట్లు సమాచారం. అయితే ఒకేసారి ముగ్గురు నేతల ఇళ్లలో ఐటీ దాడులు జరగడంతో బీఆర్ఎస్ నేతలు ఆందోళన చెందుతున్నారు. రెండేళ్ల కిందట కూడా బీఆర్ఎస్ నేతలకు ఐటీ అధికారులు షాక్ ఇచ్చారు. అప్పుడు కొందరు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. సోదాలు పెద్దఎత్తున జరగకపోయినప్పటికీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఆందోళన చెందారు. తిరిగి వారం క్రితం ఏకకాలంలో ఒక ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్యేలు, మరో నేత ఇళ్లు, సంస్థల్లో సోదాలు చేపట్టడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

# 'జై తెలుగు పార్టీ' పేరుతో ఏపీలో కొత్త పార్టీ ఆవిర్భావం..

## -తెలుగు భాషా పరిరక్షణ అజెండాతో వచ్చే ఎన్నికలలో పోటీ: జొన్నవిత్తుల



విజయవాడ జూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఏపీలో చడీ చప్పుడు లేకుండా ఓ కొత్త పార్టీ ఆవిర్భవించింది. ఎలాంటి హంగామా లేదు. కనీసం ఒక చిన్న ప్రకటన కూడా లేకుండా కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించింది. పార్టీ పేరు ఇంచుమించు తెలుగుదేశం పార్టీ మాదిరిగానే ఉంది. తెలుగు వాడి ఆత్మగౌరవం పేరుతో నాడు ఎన్టీఆర్ టీడీపీని ప్రారంభిస్తే.. ఇప్పుడు తెలుగు భాషా పరిరక్షణ కోసం అంటూ జై తెలుగు పార్టీని కవి, సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు ప్రారంభించారు. తెలుగు భాషా సంస్కృతి కోసం ప్రత్యేక రాజకీయ వేదికను ఏర్పాటు చేస్తున్నానని జొన్నవిత్తుల పేర్కొన్నారు. రాజకీయ నాయకులకు, ప్రజలకు సరైన అవగాహన కల్పించడమే తన లక్ష్యమని తెలిపారు. వారిని చైతన్య వంతులుగా చేయడానికే ఈ రాజకీయ వేదికను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు.

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏపీ బాగా నష్టపోయిందని జొన్నవిత్తుల అన్నారు. భాషా, సంస్కృతి పూర్తిగా వీధిన పడిపోయిందన్నారు. ఈ విలువల కోసం రాజకీయ నాయకులు, ప్రజలు పనిచేయాలన్నారు. జై తెలుగు పేరుతో ఐదు రంగులతో పతాకాన్ని కూడా రూపొందించానని జొన్నవిత్తుల తెలిపారు. నీలం రంగు జలం, పచ్చ రంగు వ్యవసాయం, ఎరుపు రంగు శ్రమశక్తి, పసుపు వైభవానికి చిహ్నం, తెలుపు జల వనరులు స్వచ్ఛంగా ఉండాలన్నారు. వెనుక తెలుగు భాష రథాన్ని ప్రజలు లాగాలనేది తన ఆకాంక్షగా జొన్నవిత్తుల చెప్పుకొచ్చారు. తెలుగు భాష కోసం ఐదుగురు మహనీయులు కృషి చేశారని.. త్యాగాలు చేశారని వెల్లడించారు. గిడుగు రామ్మూర్తి నాయుడు, కందుకూరి వీరేశలింగం పంతులు, పొట్టి శ్రీరాములు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, మాజీ ముఖ్యమంత్రి యన్టీఆర్ చిత్రాలు తన జై తెలుగు రాజకీయ జెండాలో, ఎజెండాలో ఉంటాయన్నారు.తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని నిలబెట్టిన వారు ఎందరో ఉన్నా.. ఈ ఐదుగురు ముందు వరుసలో ఉంటారని జొన్నవిత్తుల అన్నారు. మన భాషా సంస్కృతి వైభవం గురించి నేడు ఎవ్వరికీ తెలియని పరిస్థితి నెలకొందన్నారు. నాడు మదరాసీలు అన్నారని.. నేడు హైదరాబాదీలు అనిపించుకుంటున్నామన్నారు. కానీ తెలుగు వాళ్లం అని మాత్రం అనిపించులేక పోతున్నామన్నారు. మన భాషను మనమే విస్మరించి చులకన చేసుకున్నామని జొన్నవిత్తుల పేర్కొన్నారు. తెలంగాణ భాష మొత్తం ఒక్కటే.. ఏపీలో మాత్రం ప్రాంతాల వారీగా భాష మారిపోతుందన్నారు. ఉత్తరాంధ్ర, గోదావరి, కృష్ణా-గుంటూరు, నెల్లూరు, రాయలసీమ ఐదు రకాల భాషలు ఏపీకి ఉన్నాయన్నారు. తెలుగు భాషకు పునర్వైభవాన్ని తీసుకురావాలనేదే తన సంకల్పమన్నారు. మన భవిష్యత్తు తరాలకు మన తెలుగు భాషను అందించాలన్నారు. లక్షల కోట్ల బడ్జెట్, అధికారం ఉన్న ప్రభుత్వాలు తెలుగు భాషకు సమున్నత స్థానం కల్పించాలన్నారు. మాతృ భాష పరిరక్షణ .. రాజకీయ నాయకుల బాధ్యత అన్నారు. ఆగస్ట్15 నాటికి తమ పార్టీ విధివిధానాలు ప్రకటిస్తామన్నారు. తెలుగు భాషా పరిరక్షణ అజెండాతో వచ్చే ఎన్నికలలో పోటీ చేస్తామని జొన్నవిత్తుల ప్రకటించారు.

# బాబును ఎదుర్కోవడానికి.. జగన్ ప్లాన్..

## -అంబానితో చేట్టాల్ పట్టాల్

అమరావతి జూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);2019 ఎన్నికల్లో నవరత్నాలు అంటూ అధికారంలోకి వచ్చిన జగన్.. అవి ఎంతమేరకు అమలు చేశారన్నది ఆయనకే తెలియాలి. అయితే.. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఈసారి ఏం చేయాలి.. ఏం చెప్పి ఎన్నికలకు వెళ్లాలి.. మేనిఫెస్టోలో ఏమేం పెట్టాలి.. అనేది జగన్‌కు దిక్కుతోచట్లేదట. ఓ వైపు ఏపీలో ఆర్థిక పరిస్థితి దిగజారిపోవడం, మరోవైపు రోజు రోజుకూ వైసీపీకి గ్రాఫ్ తగ్గిపోతుండటంతో ఏం చేయాలో జగన్‌కు దిక్కుతోచట్లేదట. ఈ పరిస్థితుల్లో జనాలను మెప్పించడానికి ఏం ప్లానుందబ్బా అని ఆలోచించగా.. జియో టవర్స్ గుర్తొచ్చాయట. ఆలోచన వచ్చిందే ఆలస్యం వెంటనే 100 టవర్లను వర్చువల్‌గా ప్రారంభించేశారట. ప్రతి ఒక్కరి చేతిలో ప్రస్తుతం సెల్‌ఫోన్ కామన్ అయిపోయింది.. అందుకే అంబానీ సహకరంతో రాబోయే ఎన్నికల మేనిఫెస్టోలో ఉచితంగా రీచార్జ్‌లు ఫ్రీ వైఫై సేవలు, ఫైబర్‌నెట్ సేవలన్నీ అందించడానికి సిద్ధమవుతున్నట్లుగా విశ్వసనీయవర్గాల సమాచారం. ఎందుకంటే.. ఇప్పటికే మిని మేనిఫెస్టోలో మహిళా ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ఉచిత బస్సు ప్రయాణం చంద్రబాబు ప్రకటించగా.. అంతకుమించి చేయాలంటే ఉచిత రీచార్జ్ పథకంతో కొట్టాలన్నది జగన్ ప్లానట. అందుకే ఏం చేసినా టీడీపీ మేనిఫెస్టోకు మించి కలర్‌ఫుల్‌గా ఉండాలని జగన్ భావిస్తున్నారట. ఇప్పటికే టీడీపీ ప్రకటించిన మినీ మేనిఫెస్టోను తెలుగు తమ్ముళ్లు జనాల్లోకి విస్తృ?తంగా తీసుకెళ్తున్నారు. త్వరలోనే మరో మేనిఫెస్టోను టీడీపీ రిలీజ్ చేయనుంది. వీటన్నింటినీ ఎదుర్కోవాలంటే ఇప్పుడు నవరత్నాలు అస్సలు పనికిరావని పసిగట్టిన జగన్.. ఫ్రీ.. ఫ్రీ.. ఫ్రీ అని ప్రకటించబోతున్నారట. బాబును తట్టుకోవడం చేతగాక అంబానీతో జగన్ చేతులు కలిపారన్న విషయం స్పష్టంగా అర్థమవుతోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ విషయాలన్నింటినీ ఏపీ ప్రజలు గ్రహించి.. ఏ పార్టీవైపు అడుగులేస్తారో ఏంటో మరి. చూశారుగా.. రానున్న ఎన్నికల్లో వైసీపీ భారీగానే ప్లాన్ చేసుకుంటూ ముందుకెళ్తోంది. ఈ పరిస్థితుల్లో ఇవన్నీ ఏ మాత్రం వర్కౌవుట్ అవుతాయో.. వీటన్నింటినీ తిప్పికొట్టడానికి చంద్రబాబు ఇంకేరేంజ్‌లో వ్యూహాలు రచిస్తారో వేచి చూడాల్సిందే మరి.

# సోదరి స్నేహితురాలిపై యువకుడి అత్యాచారం

మెదక్, జూన్ 20:(నేటినిజం ప్రతినిధి):సోదరి స్నేహితురాలిపై ఓ యువకుడు పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన ఘటన తెలంగాణ రాష్ట్రంలోని మెదక్ జిల్లాలో చోటుచేసుకుంది. మెదక్ జిల్లా శివంపేట మండలంలో ఓ యవకుడు ఓ బాలికను పలుమార్లు అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే రమేష్ (22) అనే యువకుడికి చెల్లి ఉంది. అయితే ఓసారి వాళ్ల ఇంటికి రమేష్ చెల్లి స్నేహితురాలు(14) వచ్చింది. ఆ సమయంలో రమేష్ కూడా ఇంట్లోనే ఉన్నాడు.

అయితే తన సోదరి స్నేహితురాలిని బెదిరించి అత్యాచారం చేశాడు. అలాగే పలుమార్లు ఆ బాలికపై రమేష్ అత్యాచారం చేశాడు. అయితే ఇటీవల ఆ బాలిక ప్రవర్తనలో మార్పులు వచ్చాయి. ఆమె తల్లిదండ్రులు ఆస్పత్రికి వెళ్లి చూపించారు. ఆ బాలిక ఐదు నెలల గర్భవతిగా వైద్యులు తేల్చారు. దీంతో ఆమె తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు రమేష్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి ప్రస్తుతం విచారణ జరుపుతున్నారు.




# జిల్లా వ్యాప్తంగా ఘనంగా విద్యా దినోత్సవం

-మన ఊరు మనబడి కార్యక్రమంలో పనులు పూర్తయిన పాఠశాలలను ప్రారంభించిన ప్రజాప్రతినిధులు
-విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్ పంపిణీ
-లాంఛనంగా రాగిజావ పంపిణీ
-విద్యా, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత
-కార్పోరేట్ దీటుగా ప్రభుత్వ పాఠశాలలు - పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి
-విద్యారంగంలో గణనీయమైన మార్పులు
-విద్యతోనే వికాసం, విజయం - జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్



సంగారెడ్డి, జూన్ 20 (నేటి నిజం ప్రతినిధి): తెలంగాణ ప్రభుత్వం విద్యా, వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చి పెద్దపీట వేసి ముందుకు తీసుకు వెళుతుందని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవంను పురస్కరించుకుని పటాన్చెరు నియోజకవర్గంలో మన ఊరు మనబడి కార్యక్రమంలో చేపట్టిన పలు పాఠశాలలను ఆయన ప్రారంభించారు. జిన్నారం మండలం నల్తూర్ గ్రామంలో జిల్లా కలెక్టర్ శరత్, ఎమ్మెల్యే పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా ఎంఈఓ విద్యార్థి దినోత్సవ నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైద్యం విద్యపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతున్నారన్నారు. తెలంగాణ రాకముందు బడులు ఎలా ఉన్నాయి, వచ్చాక పరిస్థితి ఎలా ఉందన్నది ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పోరేట్ పాఠశాలలకు గీటుగా అన్ని సౌకర్యాలను సమకూర్చి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. వైద్యం, విద్యను ప్రోత్సహిస్తే మన ప్రాంతం, జిల్లా రాష్ట్రం బాగుపడుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ప్రోత్సహించాలని, విద్యార్థుల సంఖ్య మరింత పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈనెల 22న పటాన్చెరులో 350 కోట్ల రూపాయలతో 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి సీఎం శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఉస్మానియా ఆస్పత్రి స్థాయిలో వైద్య సేవలు అందుతాయన్నారు.

జిల్లా కలెక్టర్ శరత్ మాట్లాడుతూ గతంలో ఇలాంటి గొప్ప స్కూల్స్ ఎక్కడ చూడలేదని, అప్పుడు హాస్టల్స్ లో సీటు దొరకడమే కష్టమన్నారు. ఈ విద్యార్థులు విద్యార్థినులు చాలా అదృష్టవంతులని, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నకల సౌకర్యాలతో ప్రభుత్వం విద్యనందిస్తుందని అన్నారు. మన ఊరు మనబడి కార్యక్రమం కింద జిల్లాలో 212 కోట్లతో 441 పాఠశాలల్లో పనులు చేపట్టామని, వంద పాఠ శాలల పనులు పూర్తె ప్రారంభించుకుంటున్నామన్నారు. 2014 లో పాఠశాల ఎలా ఉంది ఈరోజు ఎలా ఉందో ఆలోచన చేయాలన్నారు. మార్పు ఏ విధంగా వచ్చిందన్నది చూడాలన్నారు. మైనార్టీలకు జిల్లాలో 12 రెసిడెన్షియల్ పాఠశాలలు వచ్చాయని, అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ బీసీలకు రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసి కేజీ టు పీజీ వరకు ఉచిత బోధన జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. విద్యతోనే వికాసం,విజయమని, విద్య వికాసమైతే ఆ ఇల్లు, గ్రామం అభివృద్ధి చెందుతుందని, సంస్కారవంతమైన పౌరులుగా రూపొందుతారని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలతో అందిస్తున్న విద్యను విద్యార్థులు అందిపుచ్చుకుని ఉన్నతంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ కోరారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు నోట్ బుక్స్ యూనిఫారాలను పంపిణీ చేశారు. రాగి జావాను విద్యార్థులకు అందించారు. గ్రామ సర్పంచ్ జనార్ధన్ కరెంటు ట్రాన్స్ఫార్మర్ విషయమై సమస్యను వివరించగా, సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్పర్సన్ ప్రభాకర్, డిఇఓ వెంకటేశ్వర్లు, డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, ఎస్ఎంసి సభ్యులు, గ్రామ ప్రజలు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# డిజైనింగ్ వర్క్ చేస్తుండగా ప్రమాదం.. చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రంగారెడ్డి, జూన్ 20: రంగారెడ్డి జిల్లాలోని నందిగామ మండలంలో బిల్డింగ్ వర్క్ చేస్తుండగా ప్రమాదం జరిగింది. అయ్యప్ప టెంపుల్ పరిధిలోని షాధిఖానాలో డిజైనింగ్ వర్క్ చేస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు చనిపోయాడు. ఈ ఘటన ఇవ్వాల (మంగళవారం) ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. వెస్ట్ బెంగాల్ రాష్ట్రం , ఇష్కపూర్ గ్రామానికి చెందిన బాబుల్ మండల్ (56) కొంతకాలంగా నందిగామ మండలంలోని అయ్యప్ప టెంపుల్ దగ్గర నివాసం ఉంటున్నాడు. బీఫ్లగ్ షాదీఖానాలో డిజైనర్‌గా, ఫైబర్ ఫాల్ సీలింగ్ వర్క్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.

17వ తేదీ మధ్యాహ్నం షీట్ తయారీ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారీ కింద పడిపోయాడు. దీంతో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం శంషాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. తదుపరి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కాగా, 20వ తేదీ (మంగళవారం) ఆస్పత్రిలో చికిత్స పొందుతూనే బాబుల్ చనిపోయినట్టు డాక్టర్లు చెప్పారు. మృతుని తమ్ముని కుమారుడు భాస్కర్ మండల్, తండ్రి భీకాశ్ మండల్ పిర్యాదు మేరకు సీఐ సి ఎచ్.రామయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# రాజకీయ పబ్బం గడుపుకునేందుకు తనపై తప్పుడు ఆరోపణలు: గంగుల



కరీంనగర్ జూన్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):: బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ రాజకీయ పబ్బం గడుపుకు నేందుకు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. మంగళవారం కరీంనగర్ గ్రంథాలయంలో వీడియాతో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లపై కూడా అసత్యపు ఆరోపణలు చేసినా నాయకులు నేడు బీసీలకు అందించే లక్షా ఆర్థిక సహాయంపై కూడా అబద్దాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అర్హులైన బీసీలందరికీ విడతల వారీగా సహాయం చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ వద్దు అన్న పార్టీలు కూడా ఇప్పుడు తెలంగాణ గురించి మాట్లాడుతున్నాయని ఆరోపించారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఓట్లకోసం గ్రామాల వెంట పడుతున్నారని విమర్శించారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ విలువ మున్సిపల్ ఎన్నికల్లోనే బయట పడ్డదని, కనీసం ఒక్క కార్పొరేటర్‌ను కూడా గెలిపించుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. ఈడీ, సీబీఐ,ఐటీ వంటి సంస్థలు తన మీద విచారణ చేసినా ఏమీ తేలలేదని అన్నారు. ఎన్నికల్లో ఎంఐఎం మాత్రమే కాదు కేఏ పాల్, షర్మిల కూడా పోటీ చేయొచ్చని అన్నారు. తన జోలికి వస్తే వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రి మనస్సు పెట్టి ఏ కార్యక్రమం ప్రారంభించిన అది విజయవంతమవుతుంది

మెదక్, జూన్ 20:(నేటినిజం ప్రతినిధి):రాష్ట్ర ముఖ్యమంత్రి మనస్సు పెట్టి ఏ కార్యక్రమం ప్రారంభించిన అది విజయవంతమవుతుందని నర్సాపూర్ శాసనసభ్యులు మదన్ రెడ్డి అన్నారు. రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళ వారం శివ్వంపేట మండలం పోతులబొగడ లో ఏర్పాటు చేసిన విద్యా దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీత లక్ష్మా రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అసంఘటిత కార్మియా సంక్షేమ బోర్డు అధ్యక్షులు దేవేందర్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మన ఊరు మనబడి దక్రింద మండల పరిషద్ ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ అందజేయడంతో పాటు రాగి జావ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా మదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అన్ని మౌలిక వసతులతో తీర్చిదిద్ది పేద విద్యార్థులకు చక్కటి బోధన అందించాలనే ఉద్దేశ్యంతో మన ఊరు మన బడి కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. రెండేళ్లలో అన్ని ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన అదనపు తరగత గదులు, శౌచాలయాలు, ప్రహారి గోడలు వంటి సదుపాయాలతో కనీస మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు దిశా నిర్దేశం చేసి దాని అందుకనుగుణంగా నిధులు మంజూరుచేస్తున్నదని అన్నారు. భావిభారత పౌరులు ఆరోగ్యంగా ఉండాలనే తలంపుతో రాగి జావా ఇస్తున్నామని, మధ్యాన్నం భోజనం పెడుతున్నామని, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ ఇస్తున్నామని, కాబట్టి విద్యార్థులు మనసుపెట్టి చక్కగా చదువుకొని దేశం గర్వపడేలా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

వివిధ రంగాలలో ఉన్నతులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని, గురువు చెప్పే పాఠాలు శ్రద్ధగా విని చదువులో రాణించాలని అన్నారు. కాలం మార్పుకనుగుణంగా ఎంతటి పేద వారైనా తమ పిల్లలను బాగా చదివించాలని తల్లిదండ్రులలో తపన కనిపిస్తున్నదని, పిల్లలను పాఠశాలలో చేర్పిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీత లక్ష్మా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యా రంగంలో సంస్కరణల ద్వారా సమూల మార్పులు తీసుకువచ్చారని అన్నారు. కార్పొరేట్ పాఠశాలలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించనాడే భావిభారత పౌరులుగా తీర్చిదిద్దగలమనే లక్ష్యంతో సుమారు 7,300 కోట్ల రూపాయలతో ప్రణాళిక సిద్ధం చేసుకొని అమలుచేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలోని 26 వేల పాఠశాలలను దశవారిగా మూడు పేజ్ లలో మరమ్మతులు, అదనపు తరగతి గదుల నిర్మాణం, కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, త్రాగు నీటి సమస్య, ప్రహరీ గోడ వంటి నిర్మాణాలు, శౌచాలయాలు వంటిని నిర్మించుకోనున్నామన్నారు. అందులో భాగంగా పోతులబొగుడ లో 22 లక్షలతో అదనపు గదువు నిర్మాణం, సుందరీకరించిన పాఠశాలను ప్రారంభించుకున్నామని అన్నారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ పాఠశాలల మేజర్, మైనర్ రిపేర్లు, డ్యూయల్ డెస్క్,గ్రీన్ చాక్ బోర్డు, కిచెన్ షెడ్, డైనింగ్ హాల్,ప్రహారి గోడలు, అదనపు తరగతి గదులు, త్రాగునీరు,టాయిలెట్స్ వంటి 12 కాంపోనెంట్ తో ప్రభుత్వం మన ఊరు మన బడి క్రింద కార్యక్రమాలు చేపట్టగా నేడు జిల్లాలో పూర్తిచేసుకున్న 15 పాఠశాలలను ప్రజాప్రతినిధులచే ప్రారంభించుకుంటున్నామని అన్నారు. విద్యతోనే భవిష్యత్తు ముడిపడిఉంటుందని, పాఠశాలలో అన్ని వసతులతో చక్కటి వాతావరణం కల్పించి నాణ్యమైన విద్య అందించాలనే ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని, ఆంగ్ల మాధ్యమం కూడా చేపట్టిందని అన్నారు. పాఠశాలలో ప్రవేశాల సంఖ్య కూడా పెరుగుతుందని అన్నారు. స్కూల్ మేనేజిమెంట్ కమిటీలు కూడా చురుకైన పాత్ర వహిస్తూ ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రులలో అవగాహన కలిగిస్తూ పేద విద్యార్థులు చక్కగా చదువుకోవడానికి ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నదని కాబట్టి తమ పిల్లలను ప్రభుత్వ బడులలో ఎక్కువ సంఖ్యలో చేరేలా చూడాలన్నారు. పిల్లలు కూడా చదువుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ సూచించారు ఈ కార్యక్రమంలో ఎంపిపి హరికృష్ణ, సర్పంచ్ హరికిషన్, జెడ్పి కో అప్షన్ సభ్యులు మన్సూర్ , నీటిపారుదల డిప్యూటీ ఈ ఈ , ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల అభివృద్ధితో విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు - ఎమ్మెల్యే రేఖా నాయక్

ఆదిలాబాద్, జూన్ 20: పాఠశాలల అభివృద్ధితో విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసినట్లు అవుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖా శ్యామ్ నాయక్ అన్నారు. మంగళవారం నిర్మల్ జిల్లా, ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్, సుర్జాపూర్ గ్రామాల్లో ప్రైమరీ పాటశాల భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను చేరువ చేయాలనే సంకల్పంతో కార్యక్రమం ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్ర ఆవిర్భావం నుంచి పల్లెలు పట్టణాలు అభివృద్ధి దిశగా మారుతున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ సంకల్పం దృఢమైనదని, అరవై సంవత్సరాలలో జరగని అభివృద్ధి కేవలం తొమ్మిది సంవత్సరాల్లో జరిగిందని అన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల గ్రామ ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ వద్దిరాజు ఫోటోగ్రాఫర్ జన్మదిన వేడుకలు

- ఫోటోగ్రాఫర్ శేఖర్ కు శుభాకాంక్షలు తెలిపిన ఎంపీరవిచంద్ర



ఖమ్మం, జూన్ 20:(నేటినిజం ప్రతినిధి): తన వద్ద ఫోటోగ్రాఫర్ గా పని చేసే మల్యాల శేఖర్ పుట్టినరోజు సందర్భంగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర శుభాకాంక్షలు తెలిపి ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా శేఖర్ చేత కేక్ కట్ చేయించారు. ఖమ్మం పుర ప్రముఖులు పొదిల రవికుమార్, పత్తి శ్రీనివాస్, వెంపటి ఉపేందర్, నానబాల హరీష్, ఎంపీ రవిచంద్ర సన్నిహితులు మరికల్ పోత సుధీర్ కుమార్, ఆకుల రజిత్, ఎంపీ వద్దిరాజు క్యాంపు కార్యాలయం సిబ్బంది శేఖర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# పాఠశాలలో అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి పువ్వాడ



ఖమ్మం, జూన్ 20:(నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు భాగంగా నేడు విద్యా దినోత్సవం సందర్భంగా ఖమ్మంఎన్ఎస్పి క్యాంపులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.45.06 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్..అనంతరం డీవీఆర్సి భవనంలో జరిగిన విద్యా సంబరాల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఉత్తమ విద్యార్థులను మంత్రి అభినందనలు తెలిపి సత్కరించారు. జిల్లా వ్యాప్తంగా ఇటీవలే 10వ తరగతిలో వంద శాతం పాస్ అయిన ఉపాధ్యాయులను సబ్జెక్ట్ వారీగా ప్రశంసా పత్రాలు, మెమెంటో లు అందజేశారు. ఇదే ఒరవడి ప్రతి ఏడాది కొనసాగించాలని మంత్రి సూచించారు. రానున్న సంవత్సరంలో మరింత ఉత్తీర్ణత శాతం పెరిగే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

# తెలంగాణ వచ్చిన 9 ఏళ్లలో అన్ని రంగాలలో వృద్ధి

మెదక్, జూన్ 20:(నేటినిజం ప్రతినిధి):తెలంగాణ వచ్చిన 9 ఏళ్లలో అన్ని రంగాలలో వృద్ధి సాధించి దేశానికే ఆదర్శంగా నిలిచామని మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం హవేళిఘనాపూర్ మండలం లో దాత సహకారంతో 30 లక్షల వ్యయంతో మండల పరిషద్ పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులనువరండాను జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి 70 ఏళ్ల లో వివిధ ప్రభుత్వాలు వచ్చిన సాధించని ప్రగతి, ఈ తొమిదేళ్లలలో ప్రస్ఫుటంగా కనిపిస్తున్నదని, అన్ని రంగాలలో సాధించిన విజయాలు చెప్పడానికే ఒక్కో రంగంపై 21 రోజుల పాటు దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నామని అన్నారు. అందులో భాగంగా నేడు విద్యా దినోత్సవాన్ని నిర్వహించు కుంటున్నామన్నారు. తెలంగాణ వచ్చాక మన ఊరు మనబడి ద్వారా కార్పొరేట్ పాఠశాలలను తలదన్నే విధంగా 12 కాంపోనెంట్ పనులను చేపట్టి కనీస మౌలిక సదుపాయాలు కల్పిస్తూ,సుశిక్షితులైన ఉపాధ్యాయులచే బోధన చేస్తున్నామని అన్నారు. గొప్పింటి పిల్లలు కార్పొరేట్ బడులలో ఆంగ్ల మాధ్యమంలో చదువుచున్న వారిని చూస్తున్న పేదలు తాము తిన్నా తినక పోయిన తమ పిల్లలు ఆంగ్ల మాధ్యమంలో చదివించాలని కాంక్షతో ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపిస్తున్నారని అది గమనించిన్న ప్రబంహుత్వం వారికి వెసులుబాటు కల్పించాలనే ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తున్నదని అన్నారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, సన్న బియ్యం భోజనం తో పాటు నేటి నుండి రాగి జావ అందిస్తున్నదని అన్నారు. నేటి కంప్యూటర్ యుగం లో పోటీ పడాలంటే అంగాల మాధ్యమంలో చదివే పరిస్థితి వచ్చిందని, ఆ దిశగా ప్రభుత్వం ఆంగ్ల మధ్యమ పాఠశాలలను ఏర్పాటు చేసిందని అన్నారు. విద్య అన్నింటికీ మూలం అని, ప్రతి ఒక్కరు చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు . పిల్లలకు పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పలించుటకు దాతలు కూడా ముందుకు వస్తున్నారని, ఇక్కడా రెండు అదనపు తరగతి గదులు, వరండా నిర్మించుటకు ప్రముఖ పారిశ్రామిక వేత్త సుభాష్ రెడ్డి 30 లక్షలు ఇవ్వడం ముదావహమని అన్నారు. ప్రభుత్వం మన ఊరు మన బడి క్రింద మొదటి దశలో జిల్లాలో 313 పాఠశాలలను ఎంపిక చేసి 12 కాంపోనెంట్ పనులు చేపట్టిందని, పనులు వివిధ దశలలో ప్రగతిలో ఉన్నాయని అన్నారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ మన ఊరు మన బడి క్రింద ఈ రోజు జిల్లాలో 15 పాఠశాలలను అన్ని వసతులతో ప్రారంభించుకుంటున్నామన్నారు. హైద్రాబాద్లోని జూబ్లీ హిల్స్, బంజారా హిల్స్ లో కార్పొరేట్ పాఠశాలల మాదిరి నేడు ప్రభుత్వ బడులు తయారయ్యాయని త్వరలో అన్ని అందుబాటులోకి వస్తాయని అన్నారు. విద్య ప్రాముఖ్యతను గుర్తించిన ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలను కనీస వసతులతో మెరుగువర్చాలనే ఆలోచనతో మూడు దశలలో చేపడుచున్నదని అన్నారు. పాఠశాలల మరమ్మతులకు స్కూల్ మేనేజిమెంట్ కమిటీ, సర్పంచులు బాగా పనిచేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తున్నందున చదువుపై ప్రత్యేక దృష్టికి పెట్టాలని అన్నారు.




# పాముకాటుతో భార్య మృతి, విషమంగా భర్త పరిస్థితి

అమరావతి, జూన్ 20:కర్నూలు జిల్లాలోని సి.బెళగల్ మండలం, గుండ్రేవులలో విషాదం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గుండ్రేవుల గ్రామంలో మిద్దెపై నిద్రిస్తున్న దంపతులు లక్ష్మీ, భాస్కర్లను విష సర్పం కాటు వేసింది. దీంతో భార్యాభర్తలు ఇరువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పామును చూసిన వారు వెంటనే కేకలు వేయడంతో బంధువులు మిద్దెపైకి వెళ్లి పామును గుర్తించి చంపివేశారు. అనంతరం భార్యాభర్తలను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక భార్య మృతి చెందగా, భర్త పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు.

# చెరువులో పడి మహిళ ఆత్మహత్య

మెదక్, జూన్ 20:(నేటినిజం ప్రతినిధి):నిజాంపేట మండల కేంద్రంలోని మల్కా చెరువులో మహిళ పడి మృతిచెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం? నిజాంపేటకు చెందిన గుడ్ల లక్ష్మి వయస్సు (50) ఆమెకు ఒక కుమారుడు రంజిత్ ఉన్నాడు. అతనికి 27 సంవత్సరాలున్నా.. పెళ్లి సంబంధాలు రాకపోవడంతో మనోవేదనకు గురైంది.

సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతో భోజనం చేసి పడుకోగా.. ఉదయం లేచి చూసేసరికి ఆమె కనిపించకపోవడంతో ఆచూకీ కోసం వెతుకుతుండగా నిజాంపేటలో గల మల్కా చెరువులో ఒక మహిళ శవం ఉందని స్థానికులు తెలియజేయడంతో చెరువులో నుండి శవాన్ని బయటకు తీసిచూడగా గుడ్ల లక్ష్మిగా గుర్తించారు. మృతురాలి భర్త శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామాయంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# ఖైదీల్లో మార్పు తీసుకువచ్చేందుకు కృషి : మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, జూన్ 20: ఖైదీల్లో మార్పును తీసుకువచ్చి.. సత్ప్రవర్తన బయటకు వచ్చేలా కృషి చేస్తున్నట్లు మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఎన్సాన్‌పల్లి గ్రామంలో జిల్లా కారాగార భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు, విద్య, హాస్పిటల్ తదితర అన్నింటిలాగా జైలు సైతం అవసరవన్నారు. రూ.78కోట్లతో 34 ఎకరాల సువిశాల స్థలంలో జిల్లా జైలు నిర్మాణం చేపట్టామన్నారు. రాష్ట్రంలోనే కొత్త జిల్లాల్లో ఏర్పాటు చేస్తున్న మొదటి జిల్లా కారాగారం ఇదేనన్నారు. జైల్లలో సౌకర్యాలు కల్పించి, అవసరమైన ఉపాధి శిక్షణ, కౌన్సెలింగ్, అక్షరాస్యత నేర్పి, ఖైదీల్లో సత్ప్రవర్తన తీసుకువచ్చి దేశంలోనే రాష్ట్ర జైళ్ల శాఖ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఏడు, ఎనిమిది సంవత్సరాల కృషి ఫలితంగా సిద్దిపేటకు జిల్లా జైలు వచ్చిందని, ఈ జిల్లా జైలులో 425 మంది ఖైదులు సౌకర్యవంతంగా ఉండవచ్చున్నారు. ఇక్కడ ఓపెన్ జైలు కూడా ఏర్పాటు చేస్తామని, ధ్యానం, యోగ, నైపుణ్య శిక్షణ, కౌన్సెలింగ్ ఇచ్చేందుకే ఏర్పాట్లు చేస్తామన్నారు. ఏడాదిలో జిల్లా జైలు నిర్మాణం పూర్తి చేసి ప్రస్తుతం సిద్దిపేట పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం పక్కన ఉన్న సబ్ జైలు తరలించనున్నట్లు తెలిపారు. సబ్ జైలు ప్రాంతాన్ని సిద్దిపేట మున్సిపాలిటీ, రెవెన్యూ కార్యాలయానికి వాడుకుంటామన్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ మాదిరిగా ఎన్సాన్‌పల్లి కూడా దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. మెడికల్ కళాశాల, ఆసుపత్రి, సెంట్రల్ డ్రగ్ స్టోర్, సెంట్రల్ బట్టర్‌ఫ్లై లైటింగ్, సమీపంలోనే కోమటి చెరువు, శిల్పారామం అన్నీ ఉన్నాయన్నారు. జైళ్లశాఖ డీజీ జితేందర్ మాట్లాడుతూ.. దేశంలోనే తెలంగాణ పోలీస్, లా అండ్ ఆర్డర్, జైళ్ల శాఖకు మంచి పేరు ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తం గా తెలంగాణ ఏర్పడిన నాటినుండి ఇప్పటి వరకు 400 మంది సత్ప్రవర్తన కలిగిన జీవిత ఖైదీలను విడుదల చేశా మన్నారు. జైల్లో క్రమశిక్షణ నేర్పడం, వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వడంతో జైళ్లకు రిపీటెడ్‌గా వచ్చే ఖైదీల శాతం 8 నుంచి 2శాతానికి తగ్గిందన్నారు. కార్యక్రమంలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, ప్రిజనర్స్ డీజీ జితేందర్, ప్రిజనర్స్ ఐజీ రాజేశ్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజా శర్మ, ప్రిజనర్స్ డీఐజీ మురళీ బాబు, కమిషనర్ శ్వేత, చీఫ్ ఇంజినీర్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

